అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

సచివాలయాల సేవలు పెంచండి

- కలెక్టర్ పి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వం ఆశిస్తున్న రీతిలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సేవలను పెంచాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం ఆదోని పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆధ్వర్యంలో తహశీల్దార్, ఎంపిడిఒలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రజలకు పరిపాలనను చేరువ చేసి మరింత వేగంగా, పారదర్శకంగా సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిందని తెలిపారు. ప్రతి మండలంలోని తహశీల్దార్లు, ఎంపిడిఒలు సచివాలయాలను నిరంతరం తనిఖీ చేస్తూ సచివాలయ సిబ్బంది చురుకుగా విధులు నిర్వర్తించేలా చూడాలని ఆదేశించారు. సచివాలయానికి 10 మంది ఉద్యోగులు, దాదాపు 20 మంది వాలంటీర్ల చొప్పున మండలానికి సగటున 500 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ సచివాలయాల ద్వారా సేవలను అనుకున్న రీతిలో పెంచడం లేదని పేర్కొన్నారు. తహశీల్దార్లు, ఎంపిడిఒలు సచివాలయ వ్యవస్థను పూర్తిగా నియంత్రణలోకి తీసుకుని ప్రతి సచివాలయాన్ని వారంలో ఒకసారి తప్పకుండా తనిఖీ చేసి, సేవలు ఎలా అందిస్తున్నారని పర్యవేక్షించాలని ఆదేశించారు. తనిఖీల్లో భాగంగా రిజిస్టర్ పరిశీలించే సమయంలో ఏ సచివాలయ ఉద్యోగికి అయినా ఆన్ డ్యూటీ అని ఉంటే కచ్చితంగా అథారిటీ పర్మిషన్ లెటర్ ఉండాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహించేలా తహశీల్దార్లు, ఎంపిడిఒలు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తహశీల్దార్, ఎంపిడిఒలతో సమీక్షలు నిర్వహిస్తూ, సలహాలు, సూచనలు ఇస్తున్నామని కలెక్టర్‌కు వివరించారు. జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, ఆదోని తహశీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపిడిఒ గీతా వాణి పాల్గొన్నారు. **పత్తికొండ** ఆర్అండ్‌బి అతిథి గృహంలో తహశీల్దార్లు, ఎంపిడిఒలతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడారు. రెవెన్యూకు సంబంధించి 62 సర్వీసులు ఉండగా చిప్పగిరి మండలం నుండి అత్యధికంగా 36 సర్వీసులు ఇస్తున్నారని తెలిపారు. మిగిలిన మండలాల్లో తక్కువ సర్వీసులు నమోదవుతున్నాయని చెప్పారు. బిల్ పేమేంట్స్‌కు సంబంధించి 24 సర్వీసులు ఉండగా అస్పరి మండలం అత్యధికంగా 15 సర్వీసులు ఇస్తున్నారని, తుగ్గలి, పత్తికొండ, మద్దికేర మండలలో 4 సర్వీసులు ఇస్తూ చాలా తక్కువగా నమోదు చేస్తున్నారని తెలిపారు. భూ హక్కు పత్రాలకు సంబంధించి వాలంటీర్ లాగిన్ నుండి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎంపిడిఒలను ఆదేశించారు. 10 వ తరగతి , ఇంటర్మీడియట్ విద్యార్థుల కుల ధృవీకరణ పత్రాలు విఆర్ఒ లాగిన్‌లో పెండింగ్ లో ఉన్నాయని త్వరగా పూర్తి చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. తహశీల్దార్లు, ఎంపిడిఒ లు సచివాలయ వ్యవస్థను పూర్తిగా నియంత్రణలోకి తీసుకోని ప్రతి సచివాలయాన్ని వారంలో ఒకసారి తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఆర్‌డిఒ మోహన్‌దాస్, జిల్లాపరిషత్‌సిఇఒ నాసరరెడ్డి, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సంక్రాంతి దోపిడీ..!

- ఇష్టారాజ్యంగా ప్రయివేటు బస్సు ఛార్జీలు - ఖాళీ అవుతున్న సామాన్యుల జేబులు
- ఛార్జీల నియంత్రణలో అధికారులు విఫలం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పండుగ సీజన్ వచ్చిందంటే ప్రయివేటు ఆపరేటర్లు వసూళ్ల పండగ చేసుకుంటున్నారు. ఇష్టానుసారంగా బస్సుల ఛార్జీలను పెంచేసి ప్రయాణికులను నిలువు దోపిడీ చేసేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా ఛార్జీలను బాదేస్తున్నారు. సంక్రాంతి పండుగతో పాటు వరుస సెలువులు రావడంతో ప్రయివేటు బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు పర్సు ఖాళీ కాకా తప్పడం లేదు. పండుగ సీజన్‌లో ప్రయాణికుల నుంచి ఏర్పడిన డిమాండ్‌నే ప్రయివేటు ట్రావెల్స్ సొమ్ము చేసుకుంటున్నాయి. బస్సు రూటుతో పని లేకుండా చార్జీలను రెట్టింపు చేసేసారు. అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా ఛార్జీలను నియంత్రించాల్సిన రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న బహిరంగ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసిలోని సూపర్ లగ్జరీ బస్సుల్లో కర్నూలు నుంచి హైదరాబాద్‌కు రూ.350 ఉండగా అదే మార్గంలో ప్రయివేటులో నాన్ ఎసి సీటర్‌లో రూ.1500 వరకూ, ఎసి సీటర్‌లో రూ.1200 నుంచి రూ.2111, నాన్ ఎసి స్లీపర్‌లో అయితే రూ.900 నుంచి రూ.2వేల వరకూ, ఎసి స్లీపర్‌లో రూ.1749 నుంచి రూ.3399 వరకూ వసూలు చేస్తున్నారు. పండుగ రోజుల్లో హైదరాబాద్ నుంచి కర్నూలుకు వచ్చే వారి సంఖ్య ఎక్కువ ఉండటంతో ఆ రూట్‌లో ప్రయివేటు ట్రావెల్స్ అధిక మొత్తంలో దండుకుంటున్నాయి. హైదరాబాద్ నుంచి నంద్యాలకు ఎపిఎస్ఆర్‌టిసిలో రూ.490 ఉండగా అదే మార్గంలో ప్రయివేటులో నాన్ ఎసి సీటర్‌లో రూ.600 నుంచి రూ.1290 వరకూ, ఎసి సీటర్‌లో రూ.850 నుంచి రూ.2590, నాన్ ఎసి స్లీపర్‌లో అయితే రూ.1400 నుంచి రూ.3వేల వరకూ, ఎసి స్లీపర్‌లో రూ.1100 నుంచి రూ.2990 వరకూ వసూలు చేస్తున్నారు. కర్నూలు



నుంచి విజయవాడకు ఆర్టీసి సూపర్ లగ్జరీలో రూ.512 ఛార్జీ ఉండగా ప్రయివేటులో సీటర్‌లో రూ.858 వరకూ వసూలు చేస్తున్నారు. అదే మార్గంలో ఆర్టీసి స్లీపర్‌లో రూ.870 ఉండగా ప్రయివేటులో రూ.990 నుంచి రూ.1130 వరకూ ఉంది. విజయవాడ నుంచి కర్నూలుకు స్లీపర్‌లో రూ.800 నుంచి రూ.1090 వరకూ వసూలు చేస్తున్నారు.

బ్లాక్‌లోనూ టికెట్లు

పండగ సీజన్‌లో ఊరికెళ్లేందుకు ప్రయాణికులు సీట్ల కోసం నానా తంటాలు పడాల్సి వస్తోంది. వారం రోజుల ముందు నుంచే ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలెట్టినా సీట్లు లభించడం లేదు. ఆయా ప్రయివేట్ ట్రావెల్స్ ఆపరేటర్లు ముందుగా టికెట్లను బుక్ చేసేసి ప్రయాణికుల నుంచి వచ్చే డిమాండును బట్టి బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించుకుంటున్నారన్న వార్తలూ వినిపిస్తున్నాయి.

వైఎస్ఆర్ సుజల స్రవంతి ద్వారా
ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ప్రజాశక్తి-ఆలూరు

వైఎస్ఆర్ సుజల స్రవంతి ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. మంగళవారం మండలంలోని మరకట్టు గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. సంక్షేమం ద్వారా గ్రామానికి రూ.6.50 కోట్ల లబ్ధి చేకూర్చామని తెలిపారు. అర్హత ఉండి పథకాలు అందని వారుంటే, వారి వివరాలు సేకరించి పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. గ్రామంలో పర్యటిస్తుండగా కొందరు తాగునీటి కుళాయి సమస్య ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. మంత్రి స్పందిస్తూ... వైఎస్ఆర్ సుజల స్రవంతి ద్వారా గ్రామంలో ప్రతి ఇంటికీ కుళాయి అందించేటట్లు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో డ్రెయినేజీ కాలువకు రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మరకట్టు నుంచి మెయిన్ రోడ్డు బైపాస్ వరకు 2.5 కిలోమీటర్లు బీటీ రోడ్డు పూర్తి చేశామని, మిగిలిన 1.5 కిలోమీటర్ల రోడ్డును త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, ఎంపిపి శ్రీరాములు, ఎంపిటిసి జానకీ, ఉచ్చీరప్ప, సీనియర్ నాయకులు మల్లికార్జున రెడ్డి, మాజీ జడ్‌పిటిసి రాంభీం నాయుడు, మాజీ సర్పంచి ఎల్లప్ప, కన్వీనర్ వీరేష్, వైసిపి నాయకులు సోమేశ్వర రెడ్డి, వీరభద్రరెడ్డి, పాలక్షిరెడ్డి, ప్రహ్లాద రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

- సిఐటియు జెండాను ఎగురవేసిన నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిఐటియు 17వ అఖిలభారత మహాసభలు 18వ తేదీ నుండి 22వ తేదీ వరకు బెంగళూరులో జరుగుతున్న సందర్భంగా కర్నూలు కార్మిక కర్షక భవనం ఆఫీస్ దగ్గర కార్మిక జెండాను సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.ఎస్ రాధాకృష్ణ ఎగరవేశారు. అదేవిధంగా నగరంలో పలుచోట్ల సిఐటియు జెండాను ఎగురవేశారు. కొత్త బస్టాండ్ సుందర సర్కిల్ వద్ద ఉన్న వేర్ హౌస్ హమాలి యూనియన్ కార్మికుల జెండాను సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు ఎగరవేశారు, మార్కెట్ యార్డు కొతహమాలి, లారీ అమాలియూనియన్ జెండాలను సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు ఎగరవేశారు. విఆర్ఎల్ ట్రాన్స్‌ఫోర్టు హమాలీ కార్మికుల జెండాను సిఐటియు నగర నాయకులు కె.సుధాకర్ప ఎగరవేశారు. కల్లూర్ ఎస్టేట్ హమాలి యూనియన్ జెండాను సిఐటియు నగర కార్యదర్శి సి.హెచ్. సాయిబాబా ఎగరవేశారు. కల్లూరు సెంటర్ హమాలి యూనియన్ జెండాను సిఐటియు నగర నాయకులు ఎం.గోపాల్ ఎగరవేశారు, వీకర్ సెక్షన్ కాలనీలోని ఆటో యూనియన్ జెండాను ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, నగర అధ్యక్షులు వలిలు ఎగరవేశారు. వార్త ఆఫీస్ దగ్గర ఉన్న ఒమేగా ఆటో స్టాండ్ యూనియన్ జెండాను ఆటో యూనియన్ నగర కార్యదర్శి బి. రాధాకృష్ణ , నగర నాయకులు మాలిక్ ఎగరవేశారు, జెండావిష్కరణ తర్వాత జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నిరంకుశ, కార్మిక వ్యతిరేక జిఒ నెంబర్ 1 చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ అన్ని ప్రాంతాల్లో జిఒ కాపీలను దగ్ధం చేశారు. కార్మికులను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి పి. ఎస్.రాధాకృష్ణ, సిఐటియు నగర కార్యదర్శి సి.హెచ్. సాయిబాబా , నగర అధ్యక్షులు ఆర్. నరసింహులు , సిపిఎం పార్టీ న్యూ సిటీ రాముడులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను మారుస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తున్నారన్నారు. బిఎస్ఎన్ఎల్, రైల్వే, ఎల్ఐసి, విశాఖ ఉక్కు, బ్యాంకులు, ఎయిర్‌పోర్టు తదితర ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రైవేట్ పరం చేస్తూ కారు చౌకగా అదాని, అంబానీ వంటి కార్పొరేట్లకు కట్టబెడుతున్నదన్నారు. ఈనెల 18 నుండి 22వ తారీకు వరకు జరుగుతున్న అఖిల భారత మహాసభల్లో ఉపాధి, కార్మిక హక్కులు, సమాన పనికి సమాన వేతనం ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు, భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని కార్యాచరణ రూపొందించబోతున్నారన్నారు. ఈ మహాసభల విజయవంతానికి కృషి చేయాలన్నారు. యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, రామకృష్ణ, మనోహర్, విజయుడు, మల్లికార్జున, గోవిందు, మారెన్న, జమ్మన్న, జానీ, సిఐటియు నగర నాయకులు వి.ఉమాదేవి, రమీజాబీ పాల్గొన్నారు. అన్ని యూనియన్ల నుండి 500 మంది కార్మికులు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

జిఒ 1ని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జిఒ 1ని ఉపసంహరించుకోవాలని సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె.సుధాకరప్ప డిమాండ్ చేశారు. ఈనెల 18 నుండి 22 వరకు సిఐటియు అఖిలభారత మహాసభలు బెంగళూరులో జరుగుతున్న సందర్భంగా మహాసభల జయప్రదం కోరుతూ మంగళవారం నవత ట్రాన్స్ పోర్ట్ హమాలీ కార్మికుల జెండాను సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె.సుధాకరప్ప ఆవిష్కరించారు. ఎం. జమ్మన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో చీకటి జిఒ నెం 1 ప్రవేశపెట్టి ప్రతిపక్షాల గొంతు నొక్కే విధంగా బహిరంగ సభలు సమావేశాలు ర్యాలీలు జరపకూడదని ఎటువంటి ఆందోళనలు చేయకూడదని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న వైఖరిని ఖండిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడబలుక్కుని కార్మికులను కట్టు బానిసలుగా చేయడానికి కార్మిక చట్టాల మార్పును ప్రోత్సహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ నెల 18 నుండి 22 వరకు బెంగళూరులో జరుగుతున్న సిఐటియు అఖిలభారత మహాసభలో కార్మిక చట్టాల మార్పు గురించి చర్చించి రాబోయే కాలంలో ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీ నగరంలో పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జానీ, అబ్దుల్లా ,ఖాసీం, గోపాల్, మహేష్ హాజరయ్యా తదితరులు హాజరయ్యారు.

జిఒ 1 కాపీ పత్రాలను దహనం చేస్తున్న నాయకులు

ప్రతి నియోజకవర్గంలో మహిళా మార్టు

డిఆర్‌డిఎ పిడి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో చేయూత మహిళా మార్ట్ ఏర్పాటు చేయనున్నట్లు డిఆర్‌డిఎ పిడి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని డిఆర్ఎ కార్యాలయ సమావేశ భవనంలో జిల్లా మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పిడి మాట్లాడుతూ సంస్థాగత నిర్మాణంలో సామాజిక పెట్టుబడి నిధి, రివాల్వింగ్ ఫండ్ రికవరిని క్రమం తప్పకుండా సిబ్బందితో కలిసి చేయాలన్నారు. సంఘాల పుస్తకాల నిర్వహణ, సంఘాల గ్రేడింగ్ ను సరిగ్గా నిర్వహించాలన్నారు. బ్యాంక్ లింకేజీ నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. స్త్రీనిధి, ఉన్నతిలోన్ రికవరిని కూడా క్రమం తప్పకుండా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జీవనోపాధులలో భాగంగా పెరటి కోళ్లు, సీడ్ కాపిటల్ ద్వారా మహిళలకు ఉపాధి చేకూర్చాలన్నారు. ఐసిడిఎస్ పిడి కె ఎల్ఆర్‌కె.కుమారి మాట్లాడుతూ కిశోర బాలికలు, యుక్త వయస్సులో ఉన్న అమ్మాయిలకు, బాలింతలు, మహిళలకు పౌష్టికాహారం ద్వారా రక్తహీనత నుంచి విముక్తి కలిగించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె సీతాబాయి, సెక్రెటరీ బి.వెంకటలక్ష్మి, ట్రెజరర్ మాధవి , ఎపిడి శ్రీధర్‌రావు పిఎం(ఐబి) లక్ష్మయ్య , డిపిఎం డైరీ అనిల్ కుమార్, డిపిఎం(లైవ్లీ హుడ్స్) నర్సమ్మ యాంకర్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.



విష్ణువర్ధన్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న టిడిపి కర్నూలు మండల నాయకులు

విష్ణువర్ధన్ రెడ్డికి ఘనస్వాగతం

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

తెలుగుదేశం పార్టీ జిల్లా సీనియర్‌నేత ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డికి మంగళవారం కర్నూలు మండల టిడిపి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. బి.తాండ్రపాడులో సంక్రాంతి పండగ సందర్భంగా సర్పంచు జయన్న ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ ఆటల పోటీలను ప్రారంభించేందుకు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా టిడిపి యువ నాయకులు బి.దస్తగిరి ఆధ్వర్యంలో జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వద్ద నుంచి బి.తాండ్రపాడు వరకు సుమారు 150 బైకులు, 36 ఆటో రిక్షాలతో భారీ ఎత్తున ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆయనకు పూల వర్షంతో స్వాగతం పలికారు. అనంతరం పూలమాలతో ఘనంగా సత్కరించారు. పంచలింగాల టిడిపి సీనియర్ నాయకులు కృష్ణయాదవ్, పసుపుల టిడిపి యువ నాయకులు బి.దస్తగిరి, బి తాండ్రపాడు సర్పంచి జయన్న, దిన్నదేవరపాడు సర్పంచి మాధవస్వామి, సర్పంచులు, ఎంపిటిసిలు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బి.దస్తగిరి నాయకత్వంలో బైక్‌ర్యాలీ

విధి నిర్వహణలో క్రమశిక్షణ అవసరం

కర్నూలు రేంజ్ డిఐజి సెంథిల్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: విధి నిర్వహణలో క్రమశిక్షణతో పాటు పటిష్టంగా పోలీసులు ఉండాలని కర్నూలు రేంజి డిజిపి ఎస్ సెంట్రల్ కుమార్ అన్నారు. గత 10 రోజులుగా దాదాపు 384 మంది పిఎస్ఒ (పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్స్) లకు ఇంటెలిజెన్స్ సెక్యూరిటి వింగ్ వారి ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో(డిటిసి) మంగళవారం శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. డిఐజి మాట్లాడుతూ కర్నూలు రేంజ్ లోని కర్నూలు జిల్లా, నంద్యాల జిల్లా, కడప జిల్లా, అన్నమయ్య జిల్లాలలోని ఎఆర్ పోలీసులు 4 బ్యాచ్‌లుగా విఐపిలకు భద్రత(సెక్యూరిటి) కల్పించడంపై శిక్షణ పొందారన్నారు. విఐపిలకు, వివిఐపిలకు వ్యక్తిగత భద్రత నిర్వహించే పిఎస్‌లు వారి విధి నిర్వహణను మరింత మెరుగు పరుచుకోవాలన్నారు. వ్యక్తిగత సంరక్షణ అధికారిగా విధుల్లో ఉన్నప్పుడు చేయవలసిన, చేయకూడని పనులు గురించి తెలిపారు. జిల్లావ్యాప్తంగా వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖుల, అత్యంత ప్రముఖుల వద్ద వారి యొక్క వ్యక్తిగత భద్రత నిర్వహించే పిఎస్‌లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత క్రమశిక్షణ పాటిస్తూ విధినిర్వహణ పటిష్టంగా ఉండాలన్నారు. శిక్షణలో నేర్చుకున్నవి బాగా గుర్తుంచుకుని ఎప్పటికప్పుడు విధి నిర్వహణను కొనసాగించాలన్నారు. శిక్షణ పొందిన పిఎస్ఓ (ఎఆర్ పోలీసులు) (గన్‌మెన్‌లు)లకు కర్నూలు రేంజ్ డిఐజి పలు సూచనలు, సలహాలు చేసి దిశా నిర్దేశం చేశారు. అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ డి. ప్రసాద్, ఐఎస్ డబ్ల్యు డిఎస్‌పి ఆశీర్వాదం, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి వెంకటాద్రి, డిటిసి సిఐ శివశంకర్, ఐఎస్‌డబ్ల్యు ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఐజి సెంథిల్‌కుమార్

ప్రజా సమస్యల పరిష్కార దిక్సూచి ప్రజాశక్తి

ప్రజాశక్తి-పత్తికొండ : ప్రజా సమస్యలు పరిష్కార దిక్సూచిగా ప్రజాశక్తి పనిచేస్తుందని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం హోసూరు గ్రామంలో ప్రజాశక్తి 2023 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆకట్టుకునే కథనాలు అందించడంలో ప్రజాశక్తికి ప్రత్యేకత ఉందని అన్నారు. పేదల పక్షపాతిగా ప్రజా సమస్యలే అజెండాగా పత్రిక పనిచేస్తుందని అన్నారు. పత్తికొండ ఎంపిపి నారాయణదాసు, మండల కన్వీనర్ కారం నాగరాజు, సర్పంచి ఆముదాల నాగప్ప, ఎంపిటిసి నెట్టికల్లు వైసిపి నాయకులు బనగాని శ్రీనివాసులు, మోహన్ కృష్ణ, హెచ్‌ఎం రమేష్, విద్యా కమిటీ చైర్మన్ బోయ నెట్టకల్, ప్రజాశక్తి డివిజన్ ఇంచార్జ్ చంద్రశేఖర్, విలేకరి కౌలుట్లయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి

కష్టజీవులకు అండ సిఐటియు జెండా

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

సిఐటియు జాతీయ 17వమహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో 3 సెంటర్లలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ దగ్గర, కర్నూలు ఓల్డ్ సిటీ సుర్జీత్ భవన్‌లో, చిల్డ్రన్ పార్క్ దగ్గర ఉంటే ఆటో స్టాండులో జెండావిష్కరణ చేశారు. సివిల్ సప్లయ్ హమాలి యూనియన్ ప్రధాన కార్యదర్శి సల్మాన్ రాజు అధ్యక్షతన సివిల్ సప్లయ్స్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కృష్ణ జెండావిష్కరణ చేయగా, 2వ జెండా సుర్జీత్ భవన్ ముందు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన ఎం. రాజశేఖర్ జండాను ఆవిష్కరించారు. 3వ జండా చిల్డ్రన్ పార్క్ దగ్గర ఉండే ఆటో స్టాండులో ఆటో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి మహమూద్ అధ్యక్షతన జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ జెండాను ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా నాయకులు గౌస్‌దేశాయ్, పిఎస్.రాధాకష్ణ, విజయ్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. సిఐటియు జాతీయ మహాసభల సందర్భంగా దేశవ్యాప్తంగా సిఐటియు జెండాలను కార్మికులు ఆవిష్కరించారన్నారు. కార్మికుల సమస్యలన్నింటికీ పరిష్కారం ఈనెల17నుండి 22 వరకు బెంగుళూరులో జరిగే సిఐటియు జాతీయ మహాసభలలో చర్చించి కార్మికుల పక్షాన పోరాటం చేసి కార్మికులకు అండగా నిలుస్తామని తెలిపారు. సంఘం నాయకులు బజారి, సుంకన్న, జీపు అసోసియేషన్ సంఘం నాయకులు రాముడు పాల్గొన్నారు.

నదిలో 1.66 లక్షల చేపపిల్లలను వదిలిన అధికారులు

ప్రజాశక్తి సి బెళగల్

సి బెళగల్ మండలం లోనీ గుండ్రేవుల వద్ద నదిలోకి మత్స్యశాఖ ఉప సంచాలకులు శ్యామలమ్మ మంగళవారం లక్ష అరవైఆరువేల చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివశంకర్ నాయక్, మత్స్య అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, కార్యదర్శి రాజశేఖర్, మత్స్య గ్రామ సహాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు. శ్యామలమ్మ మాట్లాడుతూ ఆరు నెలలలోపు కేజిన్నర పైగా ఈ చేపలు వృద్ధి చెందుతాయని, మత్స్యకారులకు ప్రధాన మంత్రి ప్రత్యేక ఉపాధి అవకాశం కల్పించేందుకు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారని పేర్కొన్నారు.

పాఠశాలల్లో కంపెనీ ప్రతినిధిల పరిశీలన

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

నాడు నేడు కింద మొదటి విడత పనులు జరిగిన పాఠశాలల్లో శుద్ధ జల ,పెయింటింగు సంబంధించి కంపెనీల ప్రతినిధులు పరిశీలన చేయనున్నట్లు సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాడు నేడు పనులు పూర్తయిన పాఠశాలల్లో శుద్ధ జల యంత్రాలు , పెయింటింగ్ పర్యవేక్షణకు కంపెనీల ప్రతినిధులు పరిశీలన చేస్తారన్నారు. తాగునీటి శుద్ధ జల కేంద్రాల నిర్వహణలో లోపాలను కూడా సరిదిద్దుతారన్నారు. పెయింటింగ్ పూర్తికాని పాఠశాలల్లో సంబంధిత కంపెనీలు ఆ పనులను పూర్తి చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటా రన్నారు. కంపెనీల ప్రతినిధులు పాఠశాలలను సందర్శించినప్పుడు తప్పనిసరిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇంజనీరింగ్ అసిస్టెంట్, సిఆర్‌పి ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలన్నారు

డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇకి 18 ఫిర్యాదులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్‌పిడిసిఎల్ కార్యాలయంలో ఎస్‌సి చాంబర్లో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్ఇ కార్యక్రమానికి 18ఫోన్ కాల్స్ వచ్చాయని ఎస్ఇ ఎం. ఉమాపతి తెలిపారు. ఇందులో ప్రధానంగా బిల్లులకు సంబంధించి మూడు, విద్యుత్ స్తంభాలను సంబంధించి రెండు, విద్యుత్తు లైన్లకు సంబంధించి మూడు, మీటర్ కుసంబంధించిన ఫిర్యాదు ఒకటి, లో వోల్టేజికి సంబంధించి రెండు, కొత్త సర్వీసులు సంబంధించి మూడు, ఇతరములు నాలుగు, ఫోన్ కాల్స్ వచ్చాయని ఆయన స్పష్టం చేశారు. డబ్బులతో కూడినవి మాత్రమే ఆలస్యం అవుతుందని, మిగిలినవన్నీ వీలైనంత త్వరలో సంబంధిత అధికారులతో పూర్తి చేయిస్తామని ఎస్ఇ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఇతో పాటు డిఇ విజయభాస్కర్ పాల్గొన్నారు.

జగన్‌తోనే పేదల సంక్షేమం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కౌతాళం

పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని రౌడూరు గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఎలా అందుతున్నాయో, గ్రామాలకు ఏయే అభివృద్ధి పనులు కావాలో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోయినా సంక్షేమ పథకాలు మాత్రం ముందుకు తీసుకెళ్లడం జగన్‌కే సాధ్యమని తెలిపారు. నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. రైతుల కోసం 5 ఎత్తిపోతల పథకాలను తీసుకొచ్చినట్లు తెలిపారు. అనేక గ్రామాల్లో జల జీవన్ పథకం కింద నిధులు తీసుకొచ్చి తాగునీటి సమస్య పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి, ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ నాగరాజు గౌడ్, దేశాయ్ ప్రహ్లాద చారి, చెన్నప్ప, ఏకం రెడ్డి, సుధాకర్ రెడ్డి, సోమిరెడ్డి, మల్లికార్జున రెడ్డి, నర్సారెడ్డి, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కోఆప్షన్ సభ్యులు మాబు సాబ్, సిద్ధన్న గౌడ్, పాల్ దినకరన్, అబ్దుల్ సమ్మద్, శివరాం, గంగన్న పాల్గొన్నారు.

జిఓ 1ని రద్దు చేయాలి

- సిఐటియు ఆధ్వర్యంలో పత్రాలు దహనం

ప్రజాశక్తి - ఆదోని

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న అంజిబాబు

ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే జిఓ 1ని రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు కోరారు. జిఓ 1కి వ్యతిరేకంగా మంగళవారం పత్రాలను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం ఆదోనిలోని సిఐటియు కార్యాలయం వద్ద జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని జెండా ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా అంజిబాబు, సిఐటియు సీనియర్ నాయకులు మహానంద రెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, పిఎస్.గోపాల్, లక్ష్మన్న మాట్లాడారు. రాష్ట్రంలో సభలు, ర్యాలీలు, రోడ్ షోలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ 1ని రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయని తెలిపారు. ఉద్యోగ, కార్మికులు సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేయడానికి అవకాశం ఉండదన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే విధంగా జిఓలు తీసుకురావడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈనెల 18 నుంచి 22 వరకు బెంగుళూరులో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఉద్యోగ, కార్మికులను కోరారు. నాయకులు హనుమంతు, ఈరన్న, రాజు, చాంద్ బాష, ఉరుకుంద, మల్లికార్జున, వెంకటేశులు, రాము, ఈరప్ప, శంకరప్ప, గోపాల్ పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ విబిఆర్ పాఠశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు గాలిపటాల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వేసిన ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కరస్పాండెంట్ సుభాన్, ఉపాధ్యాయులు మనోహర్, హరీష్, విజయరాజు, వినయ్ కుమార్, మౌనిక, అనసూయ, రంగవేణి, గాయత్రి, గౌసియా పాల్గొన్నారు.

కెవిపిఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ విజయలక్ష్మి, నాయకులు

కెవిపిఎస్ జిల్లా కమిటీ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఇస్వి ఎస్ఐ విజయలక్ష్మి చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. కెవిపిఎస్ దళితుల పక్షాన నిలబడి నిరంతరం అనేక ఉద్యమాలు చేపట్టిందని తెలిపారు. దళితుల పక్షాన నీతిగా, నిజాయతీగా పోరాడే సంఘం కెవిపిఎస్ అన్నారు. అనంతరం కెవిపిఎస్ మండల కార్యదర్శి బి.తిక్కప్ప మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా అంటరానితనం, కుల నిర్మూలనపై కెవిపిఎస్ పోరాడుతోందని తెలిపారు. దళితుల సమస్యల పరిష్కారానికి మరిన్ని పోరాటాలు చేయాలని కోరారు. ఏ ప్రభుత్వం అధికారంలోకొచ్చినా దళితులపై దాడులు పెరిగాయని, వాటిని అరికట్టేందుకు అనేక ఉద్యమాలు కెవిపిఎస్ ముందుండి నడిపిస్తోందని తెలిపారు. గతంలో సంతేకుడ్లూరు గ్రామంలో చేపట్టిన ప్రతిఘటన కార్యక్రమానికి కూడా పోలీసులు సహకరించారని చెప్పారు. రాబోయే రోజుల్లో గ్రామాల్లో అంటరానితనం, వివక్షపై పోరాడతామని తెలిపారు. ఉపాధ్యక్షులు తాయన్న, వీరేశ్, కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం నాయకులు యువరాజు, వినోద్, జయరాజు, రామాంజి పాల్గొన్నారు.

సారూ... ప్లాట్లు కోల్పోతున్నాం

- న్యాయం చేయాలని హైవే బాధితుల మొర
- పరిశీలించి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ

ప్రజాశక్తి - ఆదోని

పైసా... పైసా కూడబెట్టుకొని ప్లాట్లు కొనుగోలు చేసి ఇల్లు కట్టుకుందామన్న సమయంలో హైవే పేరుతో తమకు అన్యాయం జరిగిందని బాధితులు వాపోయారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి అధికారుల సమీక్ష సమావేశానికి కలెక్టర్ పి.కోటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా హైవే బాధితులు కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా బాధితులు శంకరప్ప, శ్రీనివాసులు, ఎరుకుల వెంకటేష్, విజయ్, సుజాత మాట్లాడారు. రూ.లక్షలు వెచ్చించి లేఅవుట్ ప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం 167 హైవే కోసం అధికారులు మార్కింగ్ వేస్తున్నారని తెలిపారు. ప్లాట్ల గుండా మార్కింగ్ వేయడం వల్ల తాము నష్టపోతున్నామని వాపోయారు. రూ.107 కోట్లతో ఎమ్మిగనూరు రోడ్డు 41 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం నుంచి 7 కిలోమీటర్ల దూరం కొండల మధ్యన ఆస్పరి రోడ్డుకు కలిసే విధంగా మార్కింగ్ వేశారన్నారు. తమకు సరైన సమాధానం చెప్పే అధికారులే కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం పరిశీలిస్తే బాట మారమ్మ గుడి అవతల రోడ్డు వేయాలని ప్రతిపాదన ఉందని కలెక్టర్‌కు వివరించారు. ఊరికి దగ్గర హైవే వేయడం వల్ల ఇళ్లు కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఉందని, తమకు న్యాయం చేయాలని కలెక్టర్ వద్ద కన్నీరు మున్నీరయ్యారు. అభివృద్ధి కావాలంటే రోడ్లు అవసరమని కలెక్టర్ కోటేశ్వరరావు నచ్చజెప్పారు. ప్లాట్లు నష్టపోకుండా తమకు న్యాయం చేయాలని బాధితులు కలెక్టర్‌కు విన్నవించారు. సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, తహశీల్దార్ వెంకటలక్ష్మి పరిశీలించి నివేదిక ఇస్తారన్నారు. నష్టం జరగకుండా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని బాధితులకు హామీ ఇచ్చారు.

కలెక్టర్ కోటేశ్వరరావుతో మొరపెట్టుకుంటున్న మహిళ సుజాత

ఎర్రకోటను విమర్శించే స్థాయి లేదు

- వైసిపి నాయకులు శివారెడ్డి గౌడ్

ప్రజాశక్తి - నందవరం

ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డిని విమర్శించే స్థాయి మాధవరావు దేశాయ్‌కి లేదని వైసిపి మండల అధ్యక్షులు శివారెడ్డి గౌడ్ తెలిపారు. మంగళవారం నందవరంలోని ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే ఎర్రకోట నందవరం మండలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. ఆయన నందవరంలో పర్యటిస్తున్నందున పార్టీలకతీతంగా సొంత పార్టీలైన వైసిపి బ్యానర్లనే ముందుగా తొలగించినట్లు చెప్పారు. తర్వాతే ఇతర పార్టీల బ్యానర్లు తొలగించామని తెలిపారు. బ్యానర్ తొలగింపును రాజకీయాల కారణాలతో విమర్శించడం టిడిపి నాయకులకు తగదన్నారు. క్రిస్మస్ పండగకు ముందుగానే బ్యానర్లు ఏర్పాటు చేశారని, ఇంతవరకు ఎవరి బ్యానర్లూ తొలగించలేదని తెలిపారు. ఆ బ్యానర్లతో కొంత రాజకీయ అలజడులు ఏర్పడతాయని ముందస్తు సమాచారంతోనే వైసిపి బ్యానర్లతో పాటుగానే వాటిని తొలగించినట్లు చెప్పారు. బ్యానర్ల తొలగింపులో పంచాయతీ ఆదేశాలను పోలీసులు పాటించారని, ఎవరూ ఎలాంటి అత్యుత్సాహమూ ప్రదర్శించలేదని తెలిపారు. పోలీసులు కూడా ముందుగా అధికార పార్టీ బ్యానర్లు తొలగించారని, టిడిపి నాయకుల బ్యానర్లు మరుసటి రోజు పంచాయతీ సిబ్బంది తొలగించినట్లు చెప్పారు. ఎవరైనా బ్యానర్ ఏర్పాటు చేసుకోవాలంటే పంచాయతీ అనుమతి కచ్చితంగా తీసుకోవాలని తెలిపారు. చిన్న విషయాన్ని కూడా కొంతమంది రాజకీయం చేస్తున్నారని, తాము రాజకీయాలు మొదలుపెడితే ఒక్క బ్యానర్ కూడా పంచాయతీ ఆవరణలో కట్టలేరని చెప్పారు. జడ్‌పిటిసి చక్రవర్తి, వైసిపి నాయకులు రమేష్ గౌడ్, మీసాల సంపత్ గౌడ్, ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు శివారెడ్డి గౌడ్

ప్యాకెట్ క్యాలెండర్, గోడ స్టిక్కర్స్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ, నాయకులు

యువతను ఆదర్శంగా నిలపాలి

- డీఎస్పీ వినోద్ కుమార్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

యువతకు డివైఎఫ్ఐ ఆదర్శంగా నిలవాలని డీఎస్పీ వినోద్ కుమార్ కోరారు. మంగళవారం సిఐ కార్యాలయంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నూతన ప్యాకెట్ క్యాలెండర్, గోడ స్టిక్కర్స్‌ను డీఎస్పీ వినోద్ కుమార్, పట్టణ సిఐ మధుసూదన్, రూరల్ సిఐ మంజునాథ్, రూరల్ ఎస్ఐ సునీల్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ మాట్లాడారు. నూతన సంవత్సరంలో డివైఎఫ్ఐ తీసుకున్న నినాదం 'డ్రగ్స్ అంతం... డివైఎఫ్ఐ పంతం, అవినీతి అంతం డివైఎఫ్ఐ పంతం' చాలా బాగుందని తెలిపారు. ప్రస్తుతం అధిక సంఖ్యలో యువత డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. యువత పెడదోవ పట్టకుండా డివైఎఫ్ఐ చేపట్టే ఆటలపోటీల్లో పాల్గొనాలని కోరారు. డివైఎఫ్ఐ పట్టణ నాయకులు అజిత్, మండల నాయకులు వీరేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, పట్టణ కార్యదర్శి విజయ్, నాయకులు అంజి, శ్రీను పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ కోసం సంతకాల సేకరణ

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుందలో ఉన్న ఎస్సీ హాస్టల్‌ను పున:ప్రారంభించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు శ్రీరంగ, మండల కార్యదర్శి సతీష్ కుమార్ కోరారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ దినేష్ కుమార్‌కు సంతకాల సేకరణ పత్రాలు, వినతిపత్రం అందజేశారు. ఎఐఎస్ఎఫ్ మండల ఉపాధ్యక్షులు రాజేష్ పాల్గొన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయండి

- డిపిఒ నాగరాజు నాయుడు

ప్రజాశక్తి - ఆస్పరి

పంచాయతీల్లో పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని డిపిఒ నాగరాజు నాయుడు ఆదేశించారు. మంగళవారం ఇఒఆర్‌డి నరసింహా రెడ్డి ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో ఇట్టి పన్ను, కుళాయి కనెక్షన్, మార్కెట్ బకాయి వసూలు చేయాలని తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరులోపు పన్నులను వంద శాతం వసూలు చేయాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయాలను సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి వస్తున్నందున గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని సూచించారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టండి : సిపిఎం

మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి, ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు హనుమంతు, మండల నాయకులు బాలకృష్ణ, రామాంజినేయులు కోరారు. డిపిఒ నాగరాజు నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు సరిగా చేపట్టకపోవడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని చెప్పారు. పారిశుధ్య పనులపై పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. స్వచ్ఛ భారత్ కార్మికులకు సంవత్సరం గడుస్తున్నా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిపిఒ నాగరాజు నాయుడు

అఖిలభారత మహాసభలను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 17, 18, 19న బెంగళూరులో జరిగే సిఐటియు 17వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, మండల కన్వీనర్ బి.రాముడు కోరారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఆటో స్టాండ్ వద్ద సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ పార్టీల, కార్మిక సంఘాల స్వేచ్ఛను హరించే విధంగా తెచ్చిన జిఓ 1ని రద్దు చేయాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కార్మిక చట్టాలను, కార్మిక హక్కులను కాల రాస్తున్నాయని మండిపడ్డారు. అఖిల భారత మహాసభలు కార్మిక హక్కుల పరిరక్షణకు దిక్సూచి కానున్నాయని, జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు నాయకులు బి.రాజు, బి.కృష్ణ, ఈరన్న గౌడ్, అబ్దుల్లా, ఆది, రాజు, శేఖర్ నాయుడు, తేజ, హుస్సేన్ పీరా, ఉరుకుంద, వెంకటేష్, నల్లారెడ్డి పాల్గొన్నారు. **కోసిగి (రూరల్)** మండల కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు మండల ఉపాధ్యక్షులు వీరేష్ జెండా ఆవిష్కరణ చేశారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, సిఐటియు నాయకులు వీరేష్, రాజు, గోపాల్, నాగేంద్ర, హెప్సిబా రాణి, లూసమ్మ, వరలక్ష్మి, లక్ష్మి, ఆటో యూనియన్ నాయకులు అమీర్, నరసింహులు, రామాంజనేయులు, గువ్వల నాగిరెడ్డి, వీరేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వీరేష్, విఆర్ఏల సంఘం నాయకులు రాజు, కెవిపిఎస్ మండల కార్యదర్శి హనుమంతు, ముక్కరయ్య, హుస్సేని, దిలీప్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో జెండాను ఆవిష్కరించి, మాట్లాడుతున్న రామాంజనేయులు

ఇద్దరు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల సస్పెన్షన్

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలో పని చేస్తున్న ఇద్దరు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను జిల్లా ఉన్నతాధికారులు తాత్కాలికం గా విధుల నుంచి తొలగించారు. మండలంలోని ఒంటెడుదిన్నె గ్రామంలో ఉపాధి హామీ చట్టంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న హెచ్.బాబు, అల్వాల ఫీల్డ్ అసిస్టెంట్ బి.మునిస్వామి వారి గ్రామాల్లో ఉపాధి పనులు చేయించడంలో లక్ష్యాలను అధిగమించనందున, కూలీల హాజరు శాతం పెంచకపోవడంతో గతంలో అధికారులు వారికి నోటీసులు అందజేశారు. నోటీసులపై వారు అందజేసిన సమాధానం సంతృప్తికరంగా లేకపోవ డం, వారి పనితీరులో మార్పు లేకపోవడంతో వారిపై ఆయా క్లస్టర్లకు చెందిన పథకం సహాయ సంచాలకులు అందజేసిన నివేదికల ప్రకారం పీడీ వారిని విధుల నుంచి తాత్కాలికంగా తొలగించా రు. ఈ మేరకు సంబంధిత కార్యాలయానికి మంగళవారం జిల్లా అధికారుల నుంచి ఉత్తర్వులు అందినట్లు మండల అధికారులు తెలిపారు.

విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరులోని ప్రభుత్వ కెజిబివి బాలికల విద్యార్థులకు రిన్యూ పవర్ ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రిన్యూ పవర్ అడ్మిన్ శ్రీనివాసులు, సైట్ మేనేజర్ ఉదయ్ మాట్లాడారు. పేదలకు, విద్యార్థులకు, అన్ని వర్గాల వారికి సహాయం చేయడంలో రిన్యూ పవర్ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. 300 మంది కెజిబివి విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. పాఠశాల ఎస్ఒ సునీత పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన ఐటిడిపి నాయకులు

ప్రజాశక్తి - కోసిగి రూరల్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను మంగళవారం ఐటిడిపి నియోజకవర్గ నాయకులు హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు సల్మాన్ రాజు మాట్లాడారు. మంత్రాలయం నియోజకవర్గంలో టిడిపి చేస్తున్న కార్యక్రమాలు, త్వరలో చేయబోయే యువగళం పాదయాత్ర, రానున్న ఎన్నికలపై లోకేష్‌తో చర్చించినట్లు తెలిపారు. అనంతరం లోకేష్ మాట్లాడుతూ... టిడిపి అభ్యర్థి పాలకుర్తి తిక్కారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలిపారు. చిన్నభూంపల్లి నీలకంఠ, బసలదొడ్డి కృష్ణ, లక్ష్మారి చిదానంద, దుద్ది హుస్సేని, దుద్ది నాగేష్, ఏరిగేరి వీరేష్, కోసిగి హనుమంతు, భూంపల్లి సాంబ పాల్గొన్నారు.

ప్రజలు తిరగబడితే పోలీసులూ ఏమీ చేయలేరు

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

పోలీసులను అడ్డం పెట్టుకొని కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం తగదని, ప్రజలు తిరగబడితే పోలీసులు కూడా ఏమీ చేయలేరని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తెలిపారు. మంగళవారం మండలంలోని కపటి గ్రామంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. బియ్యం తప్ప ఏమీ ఇవ్వడం లేదన్నారు. టిడిపి హయాంలో పప్పు, ఉప్పు ఉండేవని తెలిపారు. పేదలు ఆనందంగా పండగ జరుపుకోవడానికి సంక్రాంతి కానుక ఇవ్వడం లేదని విమర్శించారు. ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉండటం సిగ్గు చేటన్నారు. రూ.9 లక్షల కోట్లు అప్పులు చేసి భారమంతా ప్రజలపై వేస్తూ, పన్నులు పెంచి, నిత్యావసర సరుకుల ధరలు పెంచారని తెలిపారు. రాష్ట్రం అంధకారంలోకి వెళ్లకుండా ఉండాలంటే సైకో పోవాలని, సైకిల్ రావాలని ప్రజలను కోరారు. టిడిపి జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, రంగస్వామి నాయుడు, రంగన్న, సర్పంచి కీర్తి, మాజీ సర్పంచి మాధవ్, బాలస్వామి, శివ, జీవన్, బుద్ధారెడ్డి, వెంకటేష్, మాబాష, లక్ష్మీనారాయణ, శివప్ప, అరేకల్ రామకృష్ణ, బాలాజీ, శ్రీనివాస్ ఆచారి పాల్గొన్నారు.

మంత్రాలయంలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లా రెడ్డి, ఎంపిటిసి వెంకటేష్, మీడియా ఇన్‌ఛార్జీ విజయరామిరెడ్డి, నాయకులు గోపాలకృష్ణ స్వామి, చిన్న సుంకప్ప, హండే హనుమంత, వనికె నాగరాజు, గణేకంటి రఘు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఏబు, పౌలు, పేతూరు నతానియేలు పాల్గొన్నారు. **గోనెగండ్ల** మండలంలోని బి.అగ్రహారం గ్రామంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి చోద్యం చూస్తోందని విమర్శించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. టిడిపి నాయకులు నాగభూషణ్ రెడ్డి, రంగన్న రాముడు, నజీర్ సాహెబ్, కులుమాల రాముడు, తిరుపతయ్య నాయుడు, అడ్వకేట్ పూజారి చంద్ర, ఎర్రబాడు శ్రీను, రంగస్వామి నాయుడు, అచ్చు గట్ల ఫక్రుద్దీన్, జిలాని బాషా పాల్గొన్నారు. **కౌతాళం**లో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' నిర్వహించారు. టిడిపి మంత్రాలయం సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, పల్లెపాడు రామ్ రెడ్డి, సురేష్ నాయుడులు ఇంటింటికి వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీలకంఠ రెడ్డి, దేశాయి నరసింహ మూర్తి, రెహ్మాన్, ముగతి లక్ష్మయ్య, మూకన్న, ఎంకోబ, రామలింగ, వీరేష్, నర్సారెడ్డి, శంకర్ రెడ్డి, తిక్కన్న, ఈరన్న పాల్గొన్నారు.

గోనెగండ్ల మండలం బి.అగ్రహారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

మంత్రాలయంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

కౌతాళంలో మాట్లాడుతున్న ఉల్లిగయ్య

ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలి

- జిఓ 1ని రద్దు చేయాలి - అంగన్వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేయాలి - సిఐటియు మండల అధ్యక్షులు కృష్ణ

ప్రజాశక్తి - హాలహర్వి

ధరలకనుగుణంగా అంగన్వాడీల వేతనాలు పెంచాలని, అంగన్వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేయాలని సిఐటియు మండల అధ్యక్షులు కృష్ణ కోరారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. వేతనంలో సగం పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాలను సచివాలయాలు పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం దారుణమని తెలిపారు. అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ అమలుకు కొన్ని ప్రాజెక్టుల్లో ఆరు నెలల నుంచి బిల్లులు చెల్లించలేదని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ తహశీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ మండల అధ్యక్షులు సుజాత, కార్యదర్శి రాజేశ్వరి, శ్రీదేవి, జ్ఞానేశ్వరి, పద్మ, గౌరి, సువార్త పాల్గొన్నారు. **కోసిగి (రూరల్)** ఎంపిడిఒ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ సిరాజ్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, మండల నాయకులు వీరేష్, రామాంజనేయులు, అంగన్వాడీ ఉద్యోగులు హెప్సిబా రాణి, లూసమ్మ, వరలక్ష్మి, లక్ష్మి దేవి, పద్మ, జ్యోతి, నాగవేణి, రాములమ్మ పాల్గొన్నారు. **ఆలూరు** తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టి, సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, సిఐటియు మండల నాయకులు శేఖర్, అంగన్వాడీ నాయకులు జయశ్రీ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

ఆలూరులో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టు కడప AT ప్రొద్దుటూరులో
A.S.NO. 23/2021
1. ఎన్.సుబ్బన్న(పోతి, వారసులు)
2. ఎన్.నాగరాజు, S/o లేటు బాలయ్య,
3. ఎన్.రాజేష్, S/o లేటు బాలయ్య,
డోర్‌నెం.4/1457/1/2-6, హనుమాన్‌నగర్, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. ...అప్పీలెంట్లు
V/S
జె.పుష్పలత, W/o రవికుమార్, D/o లేటు ఎన్.సుబ్బన్న, డోర్‌నెం.22/987, సాగుమండి వీధి, కర్నూలు సిటీ & జిల్లా. ...6వ రెస్పాండెంటు
నోటీసు
పై నెంబరు అప్పీలును రాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు వారు ఇచ్చిన ప్రతికూల తీర్పును రద్దు చేయకోరి దాఖలు చేసి వుంటున్నారు. అట్టి అప్పీలులో మీరు హాజరగుటకు గాను 31/1/2023వ తేదీన వాయిదా వుంటున్నది. సదరు వాయిదా నాడు మీరు ఖుద్దున గానీ, వకీలు గారి ద్వారా గానీ పై కోర్టులో ఉదయం 10.30 ని॥లకు తెలుపుకొనవలసి వుంటున్నది. లేని యెడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.
వాయిదా తేదీ: 31/1/2023
జి.శ్రీనివాసులు, B.Com.,B.L.,
అడ్వకేట్, ప్రొద్దుటూరు.

పత్రిక ప్రకటన

సమస్త ప్రజానీకమునకు తెలియజేయడం ఏమనగా నా క్లైయింట్ M/S శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటేడ్ వారు Thoufiq S/o Mohmmad Halim ,వారికి ఇచ్చు LOAN వ్యవహా రంలో తనపై గల ఆస్తిని తనఖా పెట్టుటకు అంగీక రించెను. కావున ఇట్టి ఆస్తిపై ఎవరి కైనా క్లైయిమ్‌లు గాని లేదా ఆక్షేపణలు గాని ఉన్న యెడల ఈ తేదీ నుంచి 11-01-2023 నుండి 17-01-2023 గాని వరకు మా ఆఫీసు నందు గాని లేదా మా క్లైయింట్ ఆఫీసు నందు గాని తెలియజేయగలరు.

SCHEDULE OF THE PROPERTY
The Plot No. 7 in Sy. No. 233 piki extent of east-west 58 feets x North-South 50 feets i.e. total extent of 322.22 sq.yards situated at Amazon resorts Narlapuram village, Veldurthi Mandal, Kurnool District, A.P. bounded by.
East : Vanka land
West : 40' feets width road
North : plot No. 6
South : plot No. 8
ADVOCATE
B.SATYANARAYANA
cell no : 9440776007

మహారాజ శ్రీ డోన్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S NO. 83/ 2022
Allagundu Venkateswaramma. ...వాది
-Vs-
Anugonda Nagalakshmamma and others. ...ప్రతివాదులు
3వ ప్రతివాదికి దావా సమన్లు
3.Anugonda Mohan Shankar S/o A.China Dastagiri, R/o H.No. 1-219, Laddagiri Village, Kodumur Mandal, Kurnool Dist.
పై నంబరు దావాలో వాది ప్రతివాదులైన మీ పైన పై తెలిపిన కోర్టులో దావా షెడ్యూలు ఆస్తులలో తనకు రావలసిన వాటా ఇవ్వమని దావా దాఖలు చేసినాడు. ఇందులో 3వ ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 17-1-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
తేది : 17-1-2023
S.Iqbal Basha,
వాది పరం న్యాయవాది,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
I.A NO.135/2022 in O.S NO. 379/ 2022
B.అశోక్ కుమార్. ...వాది/అర్జీదారు
-Vs-
సింగరి. సతీష్. ...ప్రతివాది/రెస్పాండెంటు
రెస్పాండెంటు/ప్రతివాదికి
ఆర్డర్ 39 రూలు 1,2, సి.పి.సి ప్రకారం నోటీసులు
సింగరి. సతీష్ తండ్రి S. శ్రీనివాసులు,
ఇంటి నం. 51-963/4C,
L.I.C కాలనీ, కర్నూలు.
పై నంబరు దావాలో వాది ప్రతివాది పేర 10-09-2004 న వ్రాయించి ఇచ్చిన రిజిష్టర్ సేల్ డీడ్‌ను రద్దు చేస్తూ సదరు దస్తావేజులు చెల్లనివని సదరు దస్తావేజు వాది పైన వర్తించదని 2. దావా షెడ్యూలు ఆస్తిలో ప్రతివాదులు గానీ వారి తరపున మనుషులు గానీ ప్రవేశించకుండా Ad-Intirim Injunction ఉత్తర్వు ఇప్పించమని కోరుతూ అర్జీదాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది/ రెస్పాండెంటు అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 30-1-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.
SCHEDULE :
House Site situated within the Registration and Sub-Registration District of Kurnool and within the grama panchayath limits of Kallur.
Situated in Sy.No. 106/1A2B, 106/1A2D, 106/1B3, 106/1B3, 106/1B6, paiki approved in L.P. No.44/88 with House plot bearing no.55
Bounded by :
East - Plot no.56,
West : Plot no.54,
North :Plot no.47,
South -Road.
Measuring :
East to West : 40 feet (12.1920 meters)
North to South : 55 feet (16.7640 meters)
Extent : 244.44 Sq. yards
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
తేది : 30-1-2023
A. శివరామయ్య,
Y. రాఘువేంద్ర రెడ్డి,
వాది పరం న్యాయవాదులు,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S NO. 379/ 2022
B.అశోక్ కుమార్. ...వాది
-Vs-
సింగరి. సతీష్. ...ప్రతివాది
ప్రతివాదికి దావా సమన్లు
సింగరి. సతీష్
తండ్రి S. శ్రీనివాసులు,
ఇంటి నం. 51-963/4C,
L.I.C కాలనీ, కర్నూలు.
పై నంబరు దావాలో వాది ప్రతివాది పేర 10-09-2004 న వ్రాయించి ఇచ్చిన రిజిష్టర్ సేల్ డీడ్‌ను రద్దు చేస్తూ సదరు దస్తావేజులు తప్పుడువని సదరు దస్తావేజు వాది పైన వర్తించదని 2. దావా షెడ్యూలు ఆస్తిలో ప్రతివాదులు గానీ వారి తరపున మనుషులు గానీ ప్రవేశించకుండా వాది యొక్క స్వాదీనం మరియు అనుభవమునకు ఎలాంటి భంగం కలగకుండా మరియు కోర్టు కర్చులు కోరి సదరు కోర్టు వారు ఇచ్చిన డిక్రీని సబ్-రీజిస్ట్రార్ ఆఫీసుకు పంపించులాగున ఉత్తర్వు ఇప్పించమని కోరుతూ దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 30-1-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.
SCHEDULE :
House Site situated within the Registration and Sub-Registration District of Kurnool and within the grama panchayath limits of Kallur.
Situated in Sy.No. 106/1A2B, 106/1A2D, 106/1B3, 106/1B3, 106/1B6, paiki approved in L.P. No.44/88 with House plot bearing no.55
Bounded by :
East - Plot no.56,
West : Plot no.54,
North :Plot no.47, South -Road.
Measuring :
East to West : 40 feet (12.1920 meters)
North to South : 55 feet (16.7640 meters)
Extent : 244.44 Sq. yards
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
తేది : 30-1-2023
A.శివరామయ్య,
Y.రాఘువేంద్ర రెడ్డి,
వాది పరం న్యాయవాదులు,
కర్నూలు.

1967 ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి : జెసి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి వినియోగదారులు, ధాన్యం కొనుగోలు సంబంధిత సమస్యల పరిష్కారానికి 1967 ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల రక్షణ చట్టం 2019 ప్రకారం హక్కులను కల్పిస్తూ వారిలో బాధ్యత, చైతన్యం తీసుకురావడం కోసం అనేక చర్యలు చేపట్టిందన్నారు. 1967 ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ నెంబరును అనుసంధానం చేస్తూ 18004250082/1967 (పౌరసరఫరాల శాఖ), 18004253157/14445 (ఒకే దేశం ఒకే రేషన్ కార్డు),1800 425 2388/155235 రాష్ట్ర ఆహార కమిషన్), 18004254202 (తూనికలు కొలతల శాఖ) టోల్ ఫ్రీ నెంబర్లతో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌ను ప్రవేశ పెట్టామన్నారు. ప్రజలు ఈ కాల్ సెంటర్ ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ, ధాన్యం సేకరణ, గ్యాస్ సిలిండర్, పెట్రోల్ బంకులు, తూనికలు కొలతల, బియ్యం కార్డు సేవలు తదితర ఫిర్యాదులు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కార్యాలయపు పని వేళల్లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - నంద్యాల

కృష్ణానది నీటి సక్రమ నిర్వహణ, సాగునీటి పరిరక్షణకు అత్యంత ఆవశ్యకత, అనుకూలమైన కర్నూలులో కృష్ణా నది యాజమాన్య బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి కెఆర్ఎంబి ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నంద్యాలలో రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అత్యంత వెనుకబడిన రాయలసీమలోని ఎనిమిది జిల్లాలే కాకుండా, ప్రకాశం, నెల్లూరు, తెలంగాణ లోని మహబూబ్‌నగర్ జిల్లాల ఆయకట్టుకు సక్రమంగా నీరు అందాలంటే శ్రీశైలం ప్రాజెక్టు ఉన్న కర్నూలు జిల్లాలో కృష్ణా నది యాజమాన్య బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి సోమవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కర్నూలులో బోర్డు ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించి కెఆర్ఎంబి ఛైర్మన్‌కు రాసిన ఉత్తరాన్ని ఈ సందర్భంగా ఆయన విడుదల చేశారు. సమావేశంలో సమితి ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు పాల్గొన్నారు.

ఎస్‌టియు సభ్యత్వ నమోదు

అవుకు : మండలంలోని వేములపాడు, సంఘ పట్నం, అవుకు పాఠశాలల్లో ఎస్‌టియు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా సహా అధ్యక్షుడు వై శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఎస్టియు జిల్లా అధ్యక్షుడు అజాంపేట్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ఎస్టియు సభ్యత్వ నమోదు చేపడుతున్నట్లు తెలిపారు. మండల నాయకులు షరీఫ్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడికి మాతృ వియోగం

ప్రజాశక్తి బనగానపల్లె

మండలంలోని బీరవోలు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మల్లు మద్దిలేటి రెడ్డి మాతృమూర్తి వెంకటలక్ష్మమ్మ (75) మంగళవారం మృతి చెందారు. విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా గ్రామానికి చేరుకుని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నివాళు లర్పిస్తున్న బీసీ ఇందిరా

విజయ పాల డైరీ కార్మికులపై పోలీసుల దౌర్జన్యం దుర్మార్గం : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల

విజయ పాల డైరీలో అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో విజయ పాల డైరీ ముందు ధర్నా నిర్వహించడానికి మంగళవారం వస్తున్న కార్మికులను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య అని సిఐటియు జిల్లా కార్యదర్శి వి.బాల వెంకట్, విజయ పాల డైరీ వర్కర్స్ యూనియన్ నాయకులు సుబ్బయ్య, ప్రసాద్ విమర్శించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న కార్మికులపై పోలీసులను ఉపయోగించి ధర్నాలను అణిచివేయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని హెచ్చరించారు. చేతనైతే అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, చేతకాకుంటే రాజీనామా చేసి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా 9 దళిత కుటుంబాలు వీధిన పడి ఉన్నాయని, అధికారులు, విజయ పాల డైరీ యాజమాన్యం ఆదుకోవాలని లేకపోతే భవిష్యత్తులో అన్ని సంఘాలను కలుపుకొని ఆందోళన ఉధృతం చేస్తామని, అందుకు యాజమాన్యమే బాధ్యత వహించాలని తెలిపారు. కార్యక్రమంలో విజయ పాల డైరీ వర్కర్స్ యూనియన్ నాయకుల ప్రభాకర్, నాగరాజు సిఐటియు నాయకులు ఎల్లయ్య, భాషా ,హుస్సేన్ , వెంకటరమణ, సుబ్బరాయుడు, మునయ్య, కృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

నాయకులకు, కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు

ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యాన్ని వీడాలి

- ఉగాది నాటికి 10,004 ఇళ్లు పూర్తి కావాలి
- లే అవుట్లలో అన్ని వసతులు కల్పించాం
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్న లే అవుట్లలో నిర్మించనున్న ఇళ్ల నిర్మాణాల్లో నిర్లక్ష్యాన్ని విడనాడి సచివాలయాల వారీగా కేటాయించిన వారపు లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతితో కలిసి ప్రగతి తక్కువగా వున్న సచివాలయాల వారీగా సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో ఇళ్ల నిర్మాణాలను అలక్ష్యం చేయకుండా కేటాయించిన లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా అన్ని స్టేజిల్లో ప్రగతి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉగాది నాటికి 10,004 ఇళ్లు పూర్తి చేయాలన్న లక్ష్యంలో భాగంగా ఇప్పటివరకు 159 గృహాలు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలినవి పూర్తి చేసేందుకు నియోజకవర్గ స్పెషల్, హౌసింగ్ అధికారులు, తహశీల్దారులు, ఎంపీడీవోలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. వారాంతపు లక్ష్య ప్రగతిలో 78 సచివాలయాలు వెనుకబడి వున్నాయని, కారణాలేమిటని ప్రశ్నించారు. ప్రతి మండలంలో మూడు సచివాలయాల పరిధిలో ప్రగతి లక్ష్యాన్ని సాధించ లేదన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఏ ఏ స్టేజిలో ఇళ్ల నిర్మాణాలు పూర్తయితే జియో ట్యాగింగ్ చేసి, యం.బుక్ రాసి బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రగతి తక్కువగా ఉన్న సచివాలయాలన్నీ వచ్చే

వారానికి ప్రగతి తీసుకురావాలని సూచించారు. జెసి మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రణాళిక లేకుండా ఎలా ప్రగతి చూపిస్తారని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ వచ్చే వారానికి ప్రగతి చూపిస్తామని చెప్పడంపై ఈ వారం ఏం పని చేశారని, సచివాలయాలకు టార్గెట్ కూడా చాలా తక్కువగా ఉందని చేయలేక పోవడానికి గల కారణాలను తెలపాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ ఈఈ మాధవరావు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, లేఅవుట్ స్పెషల్ ఆఫీసర్లు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్, హౌసింగ్ డిఈలు, ఏఈలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పాటుపడదాం

- సర్పంచి దూదేకుల హుస్సేన్ బీ గురప్ప

ప్రజాశక్తి - శిరివెళ్ల

పాఠశాల అభివృద్ధికి సమైఖ్యంగా పాటుపడాలని కోటపాడు గ్రామ సర్పంచి దూదేకుల హుసేసన్ బీ గుర్రప్ప తెలిపారు. మంగళవారం మండలంలోని కోటపాడు గ్రామంలో ఎంపిపి స్కూల్లో గ్రామ సభను హెచ్ఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం సర్పంచి పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలపై ఆరా తీశారు. అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, విద్యా కానుక, పాఠశాల అభివృద్ధిపై చర్చించి పాఠశాల కల్పన, అభివృద్ధి ప్రణాళిక, పాఠశాలలకు కావాల్సిన సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వంకదార సుబ్బ సత్యానారాయణ, చైర్మన్ నాయబ్, సొసైటీ డైరెక్టర్ మాధవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ఆశా కార్యకర్తల జాబితా: డిఎంహెచ్ఒ

నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల పట్టణంలోని 13 సచివాలయాల్లో 13 ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి సంబంధించి అర్హులు, అనర్హుల జాబితాను https://nandyal.ap.gov.in వెబ్‌సైట్‌లో, జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నోటీసు బోర్డులో పొందుపరచినట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ వి.వెంకట రమణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థుల సందేహాలను, ఫిర్యాదులను స్వీకరించుటకు ఈ నెల 17వ తేది సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. దీనికి సంబధించిన గ్రీవెన్సు సెల్ జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ముత్తలూరు వాలంటీర్ రాజీనామా

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ముత్తలూరు గ్రామ సచివాలయంలో వాలంటరీగా పని చేస్తున్న మధు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో మధుసూదన రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మధు తండ్రి గ్రామ సేవకుడిగా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. తండ్రి మరణం అనంతరం సక్రమంగా విధులు నిర్వహించలేకపోతున్నానని మధు రాజీనామా ఇచ్చారని తెలిపారు.

జాతీయస్థాయిలో పతకాలు సాధించిన చౌడేశ్వరికి అభినందన

ప్రజాశక్తి - నంద్యాల

విశాఖపట్నంలో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ పోటీలలో నంద్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని పి.చౌడేశ్వరి 43 కేజీల కేటగిరిలో బంగారు పతకం, డెడ్ లిఫ్ట్ కేటగిరిలో మరొక బంగారు పతకం, బెంచ్ ప్రెస్‌లో రజిత పతకం సాధించడంతో మంగళవారం కళాశాలలో అభినందన సభ ప్రిన్సిపల్ సోమశేఖరప్ప అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థిని చౌడేశ్వరిని అభినందించారు. కళాశాల స్థల దాత ఎలుకూరు సుగుణ కుమార్, గోళ్ల సుదర్శనం శెట్టి మాట్లాడుతూ విద్యలో, క్రీడలలో రాణించిన బాలికలకు ఆర్థిక సహకారం అందజేస్తామన్నారు. చౌడేశ్వరిని శాలువతో జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. చౌడేశ్వరి మాట్లాడుతూ తనకు శిక్షణ ఇచ్చిన పుల్లయ్య, ఆనంద్ మాస్టర్ల వల్లనే తాను ఈ విజయాలు సాధించానని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, కోచ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో పతకాలు సాధించిన చౌడేశ్వరిని సత్కరిస్తున్న ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సోమశేఖరప్ప , అధ్యాపక బందం.

సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడికి సన్మానం

బనగానపల్లె : పట్టణంలోని ఏపిటిఎఫ్ డివిజన్ కార్యాలయంలో మండల అధ్యక్షులు జె. వెంకటకృష్ణుడు అధ్యక్షతన ఫ్యాప్టో జిల్లా చైర్మన్ బి.మాధవస్వామికి ఉపాధ్యాయులు ఘనంగా మంగళవారం ఆత్మీయ సన్మానం నిర్వహించారు. జిల్లా సహా అధ్యక్షులు ఎం. మధుసూదన్ రావు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జి. లింగమయ్య రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుబ్బరాయుడు, రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి సుంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గైనాలజిస్టు డాక్టర్ అమేసాకు సన్మానం

ప్రజాశక్తి - శిరివెళ్ల

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు స్థానికంగా అందిస్తున్న వైద్య సేవలకు గుర్తుగా యర్రగుంట్ల దేవదాయ ధర్మదాయ శాఖ స్టాఫ్ చంచు వెంకట రమణ, స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో గైనకాలజిస్ట్ నిపుణురాలు అమేసాను మంగళవారం ఘనంగా సన్మానించారు. అనంతరం గర్భిణులకు, వారి సహాయకులకు ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మహిళలు పాయించాల్సిన వైద్య ఆరోగ్య సలహాలను, సూచనలను గైనకాలజిస్ట్ అమేసా వివరించారు.

పాత పద్ధతిలోనే ఉపాధి పనులు పెట్టండి

- పనులు చేసిన బిల్లుల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - కొత్తపల్లి

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి పనులు గతంలో లాగా పాత పద్ధతిలోనే పనులు పెట్టాలని క్లస్టర్ ఎపిడి షాహిన్ అన్వర్, ఎంపీడీవో మేరీలకు చెంచు గిరిజనులు మొర పెట్టుకున్నారు. మంగళవారం మండలంలోని భ్రమరాంబ చెంచుగూడెం చదరం పెంట పాలెం చెరువు చెంచుగూడెంలో చెంచులు చేస్తున్న ఉపాధి పనులను ఎపిడి, ఎంపిడిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి చెంచులు సమస్యలు తెలియజేశారు. గతంలో ముందుగానే డబ్బులు వచ్చేవని ప్రస్తుతం పనులు చేసిన డబ్బులు వస్తాయా రావడం లేదని తెలియజేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసు కెళ్లడం జరుగుతుందన్నారు. వీరితోపాటు ఐటీడీఏ ఏపీవో రాజు నాయక్, టెక్నికల్ అసిస్టెంట్ బషీరూన్, సిబ్బంది ఉన్నారు.

స్కాలర్ స్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

పజాశక్తి - నందికొట్కూర్

పట్టణంలోని స్కాలర్స్ స్కూలు పాఠశాలలో ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాలూరి శివప్రసాద్, కాలూరి లక్ష్మి పాల్గొన్నారు. ఈ సం దర్భంగా కాలూరి శివప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో పిల్ల లకు మన పండుగల విలువలు తెలుస్తాయన్నారు. భోగి మంటలు వెలిగించి, పొంగలి చేయించి, రంగురంగుల ముగ్గులు వేసి గాలిపటాలను ఎగరవేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- ఆందోళనలో కాలనీవాసులు
- కన్నెత్తి చూడని విద్యుత్ అధికారులు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలంలోని పెద్ద కంబలూరు గ్రామం ఎస్సీ కాలనీలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ఉండడంతో కాలనీవాసులు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం పెద్దకంబలూరు ఎస్సీ కాలనీ వాసులు మాట్లాడుతూ నిత్యం పశువులు, మనుషులు, చిన్నారులు, విద్యార్థులు, నడుస్తూ వెళ్లే దారిలో రోడ్డుకు దగ్గరలో ఉన్న ట్రాన్స్ ఫారానికి ఉన్న విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని,ఏ క్షణంలో విద్యుత్ తీగల వల్ల ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని వెళ్తున్నామని చెప్పారు. సంబంధిత విద్యుత్ అధికారులు స్పందించి కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్ ఫార్మర్ నుంచి కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

పనులను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - వెలుగోడు

పట్టణంలోని జామియా రోఖియాబి దర్గా, షాది ఖానా మరమ్మతు నిర్మాణ పనులను, జామియా (ఫత్వా) మసీదు నవ నిర్మాణాలను జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహబూబ్ బాషా, ఏపీ ఈడబ్ల్యూఐడిసి నంద్యాల డివిజన్ ఈఈ లక్ష్మీనారాయణ మంగళవారం పరిశీలించారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి కృషితో ఈ పనులకు నిధులను మంజూరు చేయించారన్నారు. ప్రతిపాదనలు తయారుచేసి టెండర్ల కోసం ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో షాది ఖానా ప్రెసిడెంట్ మహమ్మద్ ఖాన్, మసీదు కమిటీ సభ్యులు పిట్టల సమద్, దర్గా కమిటీ సభ్యులు రెహమాన్, బాష తదితరులు పాల్గొన్నారు.

రోఖియాబీ దర్గా వద్ద అధికారులు

పిఎఫ్, కరువు భత్యం విడుదల చేయాలి : పిఆర్‌టియు

క్యాలెండరు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - చాగలమర్రి

రాష్ట్ర ప్రభుత్వం పీఎఫ్, కరువు భత్యం వెంటనే విడుదల చేయాలని పిఆర్‌టియు మండల అధ్యక్షులు ఆంజనేయరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని గొడిగనూరు ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో పిఆర్‌టియు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పీఎఫ్ బకాయిలు, కరువు భత్యం బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. తను సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం అలసత్వం చూపకూడదని తెలియజేశారు. కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా నాయకులు ఓబులపతి, రవిశంకర్రెడ్డి, మహేంద్ర పాల్గొన్నారు.

పొదుపు సంఘం మహిళలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకోండి

- ఎపిజిబి రీజినల్ మేనేజర్ నవీన్ కుమార్

ప్రజాశక్తి - గడివేముల

స్వయం సహాయక సంఘ సభ్యులు బ్యాంకులలో కనీసం రూ.పదివేలైనా డిపాజిట్ చేసుకోవాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ పిఎస్ నవీన్ కుమార్ అన్నారు. మంగళవారం గడివేములలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు శాఖలో బ్యాంకు సిబ్బంది స్వయం సహాయక సంఘ గ్రూపు లీడర్లు, సభ్యులు, ఖాతాదారులు, ఐకెపి సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో ఇతర బ్యాంకులతో పోల్చితే ప్రత్యేక వడ్డీ అందజేస్తుందన్నారు. అన్ని రుణాలు అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు గడివేముల చీఫ్ మేనేజర్ వర్గిన్ జాన్, ఫీల్డ్ ఆఫీసర్ విష్ణు తేజ్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

ప్రజాశక్తి - నంద్యాల

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల చైర్మన్ డాక్టర్ రామకృష్ణ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 4 నుండి 8వరకు విశాఖపట్నంలో జరిగిన జాతీయ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌లో జూనియర్ కేటగిరీలో 57 కేజీల విభాగంలో రామకృష్ణ డిగ్రీ కాలేజీ బిఎస్సి ద్వితీయ సంవత్సరం విద్యార్థిని అంజు ఆశ్రు వివిధ విభాగాలలో మూడు బంగారు పతకాలను సాధించింది. అలాగే సబ్ జూనియర్ కేటగిరిలో 43 కేజీల విభాగంలో విద్యార్థిని పల్లవి బంగారు పతకం, రెండు వెండి పతకాలు, సూపర్ టీన్ గర్ల్ ఆఫ్ ఇండియా టైటిల్ 2022-23 సాధించింది. బిఎస్సి మొదటి సంవత్సరం విద్యార్థి రోహిత్ వర్మ రెండు బంగారు పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల చైర్మన్ విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుబ్బయ్య, కళాశాల మేనేజర్ ప్రగతి రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్రం భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి బనగానపల్లె

మండలంలోని టంగుటూరు పెద్దమ్మ అన్నదాన సత్రం భవన నిర్మాణాలకు భక్తులు రూ. 50 వేలు విరాళం ఇచ్చినట్లు అన్నదాన సత్రం కార్యదర్శి రామ గంగిరెడ్డి మంగళవారం తెలిపారు. గోసుపాడు మండలం రాయపాడు గ్రామానికి చెందిన కాటంరెడ్డి చెన్నారెడ్డి, జయలక్ష్మమ్మల కుమారుడు విజయసాగర్ రెడ్డి, వీరి ధర్మపత్ని నిఖిత, కుమారుడు హేమాన్ష్ రెడ్డి, కుటుంబసభ్యులు రూ.50 వేలు నగదును అందజేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

మహానందిలో శిల్పా కార్తీక్ రెడ్డి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తనయుడు శిల్పా కార్తీక్ రెడ్డి మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, పాలక మండలి చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వీరికి స్వామి అమ్మవార్లకు అభిషేకం,కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలు పలికి, గజమాలతో సత్కరించి, స్వామి వారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు, వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండటం, ముందస్తు రిజర్వేషన్లు పూర్తి కావడంతో ఈనెల 12, 13, 14 తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. ఈనెల 12న సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ ట్రైన్ నెంబరు (07571), 13న కాకినాడ టౌన్- తిరుపతి ట్రైన్ నెంబరు (07573), 14న తిరుపతి - కాకినాడ ట్రైన్ నెంబరు (07574)లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

భవానీ ద్వీపంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ భవానీ ద్వీపంలో ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఎపి టూరిజం శాఖ పేర్కొంది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. భవానీ ద్వీపంలో అందుబాటులోని అనేక అడ్వెంచర్ స్పోర్ట్స్, గేమ్స్‌తోపాటు పిల్లల్లో విజ్ఞానాన్ని పెంపొందించే సైన్స్ ఎగ్జిబిషన్, డ్రాయింగ్ కాంపిటీషన్, ఎస్సే రైటింగ్, చేనేత, చేతివృత్తి కళాకారుల స్టాల్స్, వివిధ రకాల షాపింగ్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తామని టూరిజం శాఖ తెలిపింది. వీటితోపాటు ముగ్గుల పోటీలు, వంటల పోటీలు, సాంప్రదాయ వస్త్రధారణ, జానపద గీతాలు పాడటం, డ్రాయింగ్, గాలిపటాల తయారీ లాంటి పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొంది.

తెలుగు వారు పల్లె వాతావరణంలో, సాంప్రదాయ జీవన శైలిలో భోగి మంటలు, రేగుపళ్లు, బొమ్మల కొలువులు, ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసులు, గంగిరెద్దులు, గాలిపటాలు, పంచెకట్లు, రచ్చబండపై కబుర్లు, రెండెద్దుల బండ్లు, పూరిపాకలు, బంకమట్టితో కుండల తయారీ, పరవాన్నం (పాయసం), కొబ్బరి బూరెలు, ఉయ్యాల ఆటలు, కోతికొమ్మొచ్చి వంటివి ఏర్పాటు చేసినట్లు తెలిపింది. సంక్రాంతి పండుగ వారోత్సవాల్లో పాల్గొనే పెద్దలకు టిక్కెట్ ధర రూ.300, 6నుంచి 12 ఏళ్లలోపు పిల్లలకు రూ.150గా నిర్ణయించారు. ఈ టిక్కెట్‌తోనే ఫ్రీ బోటింగ్, భవానీ ఐ లాండ్‌లోకి ఫ్రీ ఎంట్రీ, దుర్గాభవానీపూజ ఆశీర్వచనం, ప్రసాదం ఉచితంగా ఇవ్వడంతోపాటు, అన్ని పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామని పేర్కొంది. 13న సంక్రాంతి సంబరాలకు పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె రోజా ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆశాఖ పేర్కొంది.

ఎన్ని నిర్బంధాలు ఎదురైనా దళితులకు అండగా నిలుస్తాం

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు
- గరగపర్రు దళితుల సాంఘిక బహిష్కరణ వ్యతిరేక ఉద్యమంలో ప్రజా సంఘాల నేతలపై అక్రమ కేసు కొట్టివేత

కోర్టుకు హాజరైన ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఎన్ని నిర్బంధాలు ఎదురైనా దళితులకు అండగా ఉంటామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం గరగపర్రులో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు ఉద్యమంలో అక్రమ కేసులు ఎదుర్కొంటున్న పలు ప్రజాసంఘాల నాయకులు మంగళవారం కోర్టు వాయిదాకు హాజరయ్యారు. సరైన ఆధారాలు లేవన్న కారణంగా కోర్టు ఈ కేసును కొట్టివేసింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే దిగిపాటి రాజగోపాల్ అధ్యక్షతన విజయోత్సవ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గరగపర్రు దళితుల సాంఘిక బహిష్కరణకు వ్యతిరేకంగా 2017 నుంచి నేటి వరకు దళితులకు అండగా నిలిచామన్నారు. గరగపర్రు దళితులకు అండగా చలో భీమవరం పిలుపు ఇచ్చిన సందర్భంగా సుమారు 120 మంది ప్రజాసంఘాల నాయకులపై నాలుగు అక్రమ కేసులు పెట్టారని తెలిపారు. అందులో మొదటి కేసును మంగళవారం భీమవరం రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు విచారించిందని అన్నారు. దీన్ని అక్రమ కేసుగా భావించి కొట్టివేయడం హర్షణీయమన్నారు. దళితుల సాంఘిక బహిష్కరణను వ్యతిరేకించిన వారిపై అక్రమ కేసులు బనాయించడం దారుణమని తెలిపారు. ఈ ఉద్యమంలో సిపిఎంతోపాటు కెవిపిఎస్, సిఐటియు, ఎస్ఎఫ్ఐ, ప్రజానాట్యమండలి, మహిళా సంఘం నాయకులు అనేక నిర్బంధాలతోపాటు అక్రమ కేసులను నేటికీ ఎదుర్కొంటున్నారని తెలిపారు. లాఠీఛార్జీలు, హౌస్ అరెస్టులు, నిర్బంధాలు, అక్రమ కేసులు ఉద్యమాలను ఆపలేవన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా దళితులు, అణగారిన అట్టడుగు వర్గాల ప్రజల హక్కులు, ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటామని తెలిపారు. సాంఘిక బహిష్కరణలో అవమానాలు ఎదుర్కొన్న బాధితులకు నేటికీ పూర్తిస్థాయిలో నష్ట పరిహారం ఇవ్వలేదని గుర్తు చేశారు. అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు ఉద్యమంలో 18 మంది నేతలపై అక్రమంగా కేసు నమోదు చేశారని తెలిపారు. ఈ కేసులో తనతోపాటు మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, సిఐటియు, కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, పట్టణ పౌర సమాఖ్య, ప్రజానాట్యమండలి, ఎస్ఎఫ్ఐ నేతలు కేసు ఎదుర్కొన్నారన్నారు. ఈ కేసును కోర్టు కొట్టివేసిందని తెలిపారు. సాంఘిక బహిష్కరణ వంటి అమానవీయమైన ఘటనలో ఇంకా అక్రమ కేసులు ఎదుర్కొంటున్న వారిపై కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కర్నూలులో అర్ధనగ్న ప్రదర్శననుద్దేశించి మాట్లాడుతున్న కృష్ణ

హమాలీల అర్ధనగ్న ప్రదర్శన

- కూలి పెంపుదల జిఒ విడుదల చేయాలని నిరసన

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కూలి పెంపుదల జిఒను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలు, గూడూరు స్టాక్ పాయింట్ల వద్ద ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లయ్ హమాలీలు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. కర్నూలులో సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కృష్ణ మాట్లాడుతూ..లోడింగ్, అన్‌లోడింగ్‌కు సంబంధించి ఇస్తున్న రూ.23ను రూ.25కు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, అయితే అందుకు సంబంధించిన జిఒను విడుదల చేయలేదని తెలిపారు. జిఒను విడుదల చేయాలని రెండు రోజులుగా నిరసన తెలుపుతున్నా.. అధికారుల నుంచి ఎలాంటి స్పందనా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జిఒను విడుదల చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గొడౌన్ల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని, రిటైర్డ్ అయిన హమాలీలకు పెన్షన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. అధికారులు స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు, తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కర్నూలులో ఆ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు శివ , గూడూరులో ఆ యూనియన్ జిల్లా కోశాధికారి రాజశేఖర్ అధ్యక్షతన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా సివిల్ సప్లయ్ హమాలీలు, గూడూరులో సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

వైద్యారోగ్యశాఖలో ఖాళీల భర్తీ

- రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజని

ప్రజాశక్తి - పలాస, కంచిలి (శ్రీకాకుళం)

సమావేశంలో మాట్లాడుతున్న వైద్యారోగ్యశాఖ మంత్రి రజని

వైద్యారోగ్యశాఖలో ఖాళీలన్నింటినీ భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజని అన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక 47 వేలకుపైగా పలు స్థాయిల పోస్టులను భర్తీ చేసిందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పలాస, మందస, కంచిలిలో మంగళవారం ఆమె పర్యటించారు. అనంతరం పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలోని సమావేశ మందిరంలో వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. త్వరలోనే ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రారంభం కానుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానికంగానే వైద్య పరీక్షలు, మెరుగైన వైద్యం అందించడమే ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ఉద్దేశమని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రుల్లో మందుల కొరత లేదని, పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఉద్దాన ప్రాంతానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏం చేశారని ప్రశ్నించారు. ఈ ప్రాంతమంతా కిడ్నీ వ్యాధితో బాధపడుతుంటే రూ.4 కోట్లతో శుద్ధ నీటిని సరఫరా చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ కిడ్నీ రీసెర్చ్ సెంటర్ నిర్మాణం పూర్తయ్యే నాటికి వైద్యాధికారులు, సిబ్బంది నియామకాలు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి కృష్ణబాబు, వైద్యారోగ్యశాఖ కమిషనర్ జె.నివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూర్పిడి యంత్రం బోల్తా..

- ఇద్దరు మహిళా కూలీల దుర్మరణం

ప్రజాశక్తి-బొబ్బిలి

నూర్పిడి యంత్రం బోల్తాపడి ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందారు. మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన విజయనగరం జిల్లా బొబ్బిలి మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. అన్నంనాయుడు వలసకు చెందిన ఎనిమిది మంది మహిళా కూలీలు వరి పంట నూర్పిడికి బయలుదేరారు. సీతానగరం మండలం జానుమల్లువలస పొలాలకు నూర్పిడి యంత్రంపై వెళుతుండగా ప్రమాదవశాత్తూ అది బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గోర్జి తిరుపతమ్మ (50), పోల లక్ష్మణమ్మ (48) అక్కడికక్కడే మరణించారు. గేదెల శ్రీదేవి, మడక సత్యవతి తీవ్రంగా గాయపడ్డారు.

గాయపడిన వారికి జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నూర్పిడి యంత్రం చొక్కాపు చంద్రరావుకు చెందినదిగా కూలీలు తెలిపారు. తిరుపతమ్మ భర్త ఆరు నెలల క్రితం మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. లక్ష్మణమ్మకు భర్త శ్రీరాములు, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రత్యేక హోదా కోసం 20 నుంచి సమరయాత్ర : చలసాని

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఎపికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోరుతూ ఈ నెల 20న విద్యార్థి, యువజన సమర యాత్ర హిందూపురం నుంచి ప్రారంభమవుతుందని ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు తెలిపారు. ఈ యాత్ర ఇచ్ఛాపురం వరకు కొనసాగనుందని చెప్పారు. విశాఖపట్నం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా సాధించకపోతే వైసిపి ప్రభుత్వం దోషిగా మిగిలిపోతుందన్నారు. ఎపికి బిజెపి చేస్తున్న అన్యాయంపై బిఆర్ఎస్ పోరాడగలదా, ఉమ్మడి ఆస్తుల విషయంలో కెసిఆర్ పట్టువిడుపులు చూపగలరా అని ప్రశ్నించారు. గతంలో అన్న మాటలకు కెసిఆర్ క్షమాపణ చెప్పి, చిత్తశుద్ధితో ఎపికి సహాయపడగలరా అని నిలదీశారు. సెమీ ఇండస్ట్రీలన్నింటినీ గుజరాత్‌కు తరలించుకుపోతున్నాయని తెలిపారు. సిక్కోలుకు ఒక్క పరిశ్రమైనా వచ్చిందా అని ప్రశ్నించారు. బిజెపి విషకౌగిలి నుంచి పవన్ కల్యాణ్ బయటకు రావాలని, ప్రత్యేక హోదా కోసం రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేనతో సహా అన్ని పార్టీలు పోరాటం చేయాలని కోరారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన పార్లమెంట్ సభ్యులు రాజీనామా చేయాల్సిన అవసరముందన్నారు. మోడీ ఇంటి ముందు హోదా కోసం ధర్నా చేయాలని కోరారు. తాము తలపెట్టిన యాత్రకు అనుమతి ఇవ్వాలని, లేకుంటే కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. సమావేశంలో సాధన సమితి ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అప్పలనాయుడు, సహాయ కార్యదర్శి కనిశెట్టి సురేష్ బాబు, సిపిఐ కార్పొరేటర్ ఎంజె.స్టాలిన్ పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీకి పార్థచంద్ర ఎంపిక

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్

విజయవాడలో జనవరి 13 నుండి నిర్వహించనున్న 5వ జాతీయ స్థాయి అండర్ 9 చెరుకూరి లెనిన్ వోల్గా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారు. మాంటిస్సోరి ఎ.క్యాంప్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న కె.పార్థచంద్ర ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర ఆర్చరీ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను జాతీయ అర్చరీలో ఎంపికయ్యాడని అర్చరీకార్యదర్శి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల అభినందన కార్యక్రమంలో పాఠశాల సమన్వయకర్త విజయలక్ష్మి పాల్గొని పార్థచంద్రను అభినందించారు. జాతీయ స్థాయిలో సత్తా చాటి ఆంధ్రప్రదేశ్ , కర్నూలుకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లాస్ ఇంచార్జి ఉపాధ్యాయులు సిసిలియారాజశేఖర్, విలువిద్య కార్యదర్శి అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పెరవలిలో తాలూకా స్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి -మద్దికెర

మండల పరిధిలోని పెరవలి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తాలూకా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ అండర్ 19 (65 కేజీ) పోటీలను శ్రీరంగనాథ స్వామి దేవాలయ ప్రాంగణంలో జనవరి 14,15 తేదీలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6:00 వరకు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. గెలుపొందిన టీములకు బహుమతులు మొదటి బహుమతి గ్రామ పెద్దలు రూ.10 వేలు, , రెండవ బహుమతి అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం డైరెక్టర్ కొండికారి రంగనాథ్ రూ.7 వేలు, మూడో బహుమతి బిజెపి పత్తికొండ నియోజకవర్గ ఇంచార్జ్ రంగా గౌడు, అన్నదాత పారా విశ్వనాథ్ , పారా ప్రసాద్ దాతలు బహుమతులను అందజేస్తారు. షీల్డ్ మెడల్స్ దాత కొలిమి హుస్సేన్, జనవరి 13 న ఎంట్రీ ఫీజు రూ.350 చెల్లించి తమ టీములను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు 6305717765, 7673951222, 9381899943, 9052969610 కాల్ చేసి సమాచారం తెలుసుకోవాలన్నారు.

ఎంపి ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న మాజీ ఎంపిపి వాసు తదితరులు

ఎంపి ఆర్.కృష్ణయ్యకు ఆత్మీయ సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

బిసి సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు ఎంపి ఆర్.కృష్ణయ్యను వైసిపి నాయకులు, మాజీ వైస్ ఎంపిపి ధర్మవరం వాసు మంగళవారం హైదరాబాదులోని కృష్ణయ్య స్వగృహంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ మేరకు ఆయన కృష్ణయ్యకు శాలువా పూలమాలతో ఆత్మీయ సన్మానం చేశారు. బిసిల ఐక్యత, అభ్యున్నతి కోసం పాటుపడుతున్నందుకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పద్యనాటకం తెలుగు వారి ప్రత్యేకత

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

ప్రాచీన కళలను నాటక రంగాన్ని ప్రోత్సాకించాల్సిన అవసరం వుందని టిజివి కళాక్షేత్రం ఇందు కోసం నిరంతరం కృషి చేస్తుందని యువపారిశ్రామికవేత్త టిజి భరత్ అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక టిజివి కళాక్షేత్రంలో సురభి భానోదయం నాట్య మండలి ప్రదర్శించిన భక్త ప్రహ్లాద నాటక ప్రదర్శన ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కుటుంబ సమేతంగా, నాటకానికి కర్నూలు ప్రజలు హాజరు కావటం ఆనందదాయకమన్నారు. కళాకారుల ప్రోత్సాహం కోసం త్రికరణ శుద్ధిగా చేయూతనిస్తామన్నారు. సురభి సంస్థ రాయలసీమలో పద్యనాటకాన్ని వ్యాప్తి చేసిందన్నారు. నాటక రంగానికి తనవంతు చేయూత నిస్తానణీ రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. సురభిసంస్థలో పాల్గొన్న 13 మంది మహిళా కళాకారులను చీరలతో ఆయన సత్కరించారు. టిజివి కళా క్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య స్వాగతం పలుకుతూ నటులు నందమూరి తారకరామారావు శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జనవరి 18చివరిరోజుల స్థాయి పద్యనాటక ఏకాంకికలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. టిజివి కళాక్షేత్రం తరపున రూ.2లక్షల పారితోషికాన్ని అందజేశారు. కార్యక్రమంలో మహమ్మద్‌మియా, ఇనాయతుల్లా సంగా ఆంజనేయులు, బాలవెంకటేసులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన ప్రదర్శనలు

మూడు రోజులపాటు కన్నుల పండుగ చేసిన మాయాబజార్ , భక్త ప్రహ్లాద సురభి వినోదిక ప్రదర్శనలు మంగళవారం రాత్రి ముగిశాయి. చాలా కాలంతర్వాత కర్నూలులో సురభినాటక ప్రదర్శనలు జరగటంలో పద్య నాటక ప్రదరనలకు ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రతిరోజు రాత్రి 7గంటల. కు ప్రారంభమై 9.30గంటల వరకు ప్రదర్శనలను తిలకించారు.

హైకోర్టు వ్యాక్యలతో సజ్జలకు జ్ఞానోదయం కావాలి

టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్రకుమార్

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

మాట్లాడుతున్న నంద్యాల నాగేంద్రకుమార్

హైకోర్టు వ్యాఖ్యలతో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి ఇప్పటికైనా జ్ఞానోదయం కావాలని, రాజ్యాంగ వ్యవస్థలను తప్పు పట్టడం సజ్జలకు సరికాదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల మహేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం కర్నూలు టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నంద్యాల నాగేంద్ర కుమార్ మాట్లాడారు.వైఎస్. జగన్మోహన్‌రెడ్డికి పరిపాలన చేతగాక ప్రతి రోజు ఏదో ఒక అంశంపై మీడియాకు, సోషల్ మీడియాకు అడ్డంగా దొరికిపోవడం, ఆయన బయటకు రాలేని స్థితిలో ప్రతి చిన్న అంశాన్ని తన సామాజిక వర్గానికి చెందిన సలహాదారులకు అప్పగించి తాను చిరునవ్వుతో పోజులిస్తుంటారని ఎద్దేవా చేశారు. ఇలా సలహాదారుల నియామకం వైసిపి ప్రభుత్వంలో పదుల నుండి వందలలోకి చేరడంతో ఎంతో ప్రజాధనం వృదా అవుతుందన్నారు. ఐఎఎస్‌లుండగా సలహాదారులెందుకని కోర్టు మందలించడంతో కొందరు కోర్టులను తప్పు పట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలా నియమించుకున్న సలహాదారులకంటే ఎంతో మంది ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులు పూర్తిచేసిన మహామహులున్నారన్నారు. వారి సేవలను ప్రభుత్వం వినియోగించుకోవచ్చు కానీ అలా చేయడం వల్ల తన సామాజిక వర్గమునకు మేలు చేకూర్చలేననీ జగన్ తన సామాజికవర్గం వారికి లబ్ధిచేకూర్చాలనీ సలహాదారులను నియమించుకున్నారు. ఒక్కసారిగా కోపం కట్టలు తెంచుకొని ఏకంగా న్యాయవ్యవస్థ ఏమైనా బాసా అని మండిపడటం బుడంకాయల దొంగా అంటే భుజాలు తడుముకున్నట్లుందని విమర్శించారు. కేవలం ఒక పత్రికలో పనిచేసే నీకు రాజ్యాంగ వ్యవస్థను తప్పుపట్టే అర్హత లేదన్నారు. నీకు చిత్తశుద్ధి ఉంటే ప్రజాసేవ చేయాలన్న యావ ఉంటే ఎన్నికల్లో పోటీచేసి గెలిచి అప్పుడు రాజ్యాంగ వ్యవస్థల గురించి మాట్లాడాలన్నారు. . లేదా అన్ని మూసుకొని పడిఉండాలనీ సూచించారు. వైసిపి జగన్ పుణ్యమా అంటూ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగ వ్యవస్థలైన పరిపాలనా వ్యవస్థ, పోలీస్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారాయన్నారు.

17వ అఖిలభారత మహాసభను జయప్రదం చేయండి: సిఐటియు

ప్రజాశక్తి -వెల్దుర్తి : వెల్దుర్తి మండల కేంద్రం మోటార్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆఫీస్ , రామల్లకోట హమాలీ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సిఐటియు మండల అధ్యక్షులు రాజు అధ్యక్షతన సిఐటియు జిల్లా నాయకులు నగేష్ బెంగళూరు నగరంలో జనవరి 18 నుండి 22 వరకు జరుగు సిఐటియు అఖిలభారత 17వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ జెండావిష్కరణలు చేశారు. జిల్లా నాయకులు నగేష్, మండల కార్యదర్శి రామానాయుడు మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వం ఉన్నప్పటినుండి ఇప్పటిదాకా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను కార్పొరేట్లకు తలొగ్గిన నరేంద్ర మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికుల హక్కులను హరించి వేస్తుందని తెలిపారు. భారతదేశంలో రోజురోజుకు ధరల పెరుగుదల ప్రజలపై పన్నుల భారం భారీగా పెరిగిపోయిందని కార్మికులకు కష్టజీవులైన రైతాంగం వ్యవసాయ కార్మికులకు రోజురోజుకీ శ్రమకు తగ్గ వేతనం లేకపోవడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో విలవిలలాడే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సోవియట్ యూనియన్ సహకారంతో ఏర్పడిన భారీ ఉక్కు కర్మాగారాలను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమని వారన్నారు. బెంగళూరు నగరంలో జనవరి 18వ తేదీ నుండి 22వ తేదీ వరకు జరిగే మహాసభలో కార్మిక చట్టాల పైన హక్కుల పైన కార్మిక వర్గంపై ప్రజలపై వేస్తున్న బారాలపైన సమగ్రంగా చర్చించి దేశవ్యాప్తంగా కార్మిక రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి అనేక తీర్మానాలను అఖిల భారత మహాసభ చేస్తుందని తెలిపారు. అఖిలభారత మహాసభలను కార్మిక వర్గం జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు మండల నాయకులు పెద్ద ఏసు, మారేన్న, మధు శేఖర్, మల్లి, పెద్దన్న, నాయకులు శ్రీనివాసులు, రెడ్డి బాషా తదితరులు పాల్గొన్నారు.

20 శాఖల స్టాల్స్ ఏర్పాటు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

గణతంత్ర దినోత్సవ వేడుకల్లో 20 శాఖలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రామచందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ భవనంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్‌తో కలిసి ఆయన గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేసే సమయంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించేలా ఉండాలన్నారు. అధికారులకు ఉద్యోగులకు అందజేసే ప్రశంసా పత్రాలకు సంబంధించి ప్రతిపాదనలు ఈనెల 21 లోగా పంపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ నాగేశ్వరరావు, సిపిఒ అప్పలకొండ , డిఆర్‌డిఎ పిడి వెంకటసుబ్బయ్య, డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ సార్ వలసలను నివారించండి

ప్రజాశక్తి-పత్తికొండ: పత్తికొండ మండల పరిధిలో ఉన్న గ్రామాలలో ఉపాధి కూలీలకు పనులు లేక సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారని పనులు కల్పించి వలసలను నివారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి వీరశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం పత్తికొండ అధికారుల సమీక్ష కార్యక్రమానికి వచ్చిన జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో వలసలు ఆపాలని వారు కలెక్టర్‌ను కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎపిడి పద్మావతికి అందజేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ మాట్లాడుతూ కర్నూలు పశ్చిమ ప్రాంతంలో అనేకమంది ప్రజలు సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని, ఈ వలసల్ని ప్రభుత్వమే ఆపాలన్నారు. అదేవిధంగా 200 రోజులు పని దినాలు కల్పిస్తూ రూ. 600 రోజువారి వేతనాన్ని అందించాలని కోరారు. ఇప్పటికే కొంతమంది జాబ్ కార్డు ఉన్నవారికి పని దినాలు పూర్తయి గ్రామాల్లో 60శాతం మంది ప్రజలు ఇండ్ల దగ్గరే ఉన్నారని, వారికి అదనంగా కొన్ని దినాలు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు సమ్మర్ దగ్గరలో ఉంది కనుక వారికి మజ్జిగ, టెంట్లు, రవాణా ఖర్చులు ప్రభుత్వం భరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పెదహుల్తి సురేంద్ర, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు దస్తగిరి, రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దయ్య గౌడ్ పాల్గొన్నారు.

గెలిపిస్తే దర్గాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తా

టిడిపి కర్నూలు ఇంచార్జీ టి.జి భరత్

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

కర్నూలు ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే అమ్మశా ఖాద్రీ దర్గాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టిజి భరత్ అన్నారు. మంగళవారం నగరంలోని జొహరాపురంలో ఉన్న అమ్మశా ఖాద్రీ దర్గాను నగర మైనారిటీ నాయకులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టిజి భరత్ మాట్లాడుతూ కరోనా కారణంగా ప్రజలంతా ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. భవిష్యత్తులో ఎలాంటి వ్యాధులు రాకుండా అందరూ బాగుండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఊరు బాగుంటేనే సమాజం బాగుంటుందన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ దర్గాను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం 6 వ వార్డు నాయకులు ఏర్పాటుచేసిన మధ్యాహ్న విందులో భరత్ పాల్గొన్నారు. నేతలతో కలిసి భోజనం చేశారు. వార్డు ఇంచార్జి ఇబ్రహీం, టిడిపి మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి జహంగీర్ బాష, నేతలు మెహబూబ్, నయాం, సలీం ఖాన్, జుబేర్ ఆలీ ఖాన్, 18 వ వార్డు ఇంచార్జి మోహన్, శ్రీనివాసులు గౌడ్, వెంకటయ్య, మాధవస్వామి, తిమ్మోజీ, పాల్గొన్నారు.

డిప్యూటీ తహశీల్దార్ రామనాథ్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అంగన్వాడీ వర్కర్లు, సిఐటియు నాయకులు

'సంక్రాంతి' దోపిడీ

- ఇష్టారాజ్యంగా ప్రయివేటు బస్సు ఛార్జీలు
- ఖాళీ అవుతున్న సామాన్యుల జేబులు
- ఛార్జీల నియంత్రణలో అధికారులు విఫలం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

పండుగ సీజన్ వచ్చిందంటే ప్రయివేటు ఆపరేటర్లు వసూళ్ల పండగ చేసుకుంటున్నారు. ఇష్టానుసారంగా బస్సుల ఛార్జీలను పెంచేసి ప్రయాణికులను నిలువు దోపిడీ చేసేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా ఛార్జీలను బాదేస్తున్నారు. సంక్రాంతి పండుగతో పాటు వరుస సెలువులు రావడంతో ప్రయివేటు బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు పర్సు ఖాళీ కాకా తప్పడం లేదు. పండుగ సీజన్‌లో ప్రయాణికుల నుంచి ఏర్పడిన డిమాండ్‌నే ప్రయివేటు ట్రావెల్స్ సొమ్ము చేసుకుంటున్నాయి. బస్సు రూటుతో పని లేకుండా చార్జీలను రెట్టింపు చేసేసారు. అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా ఛార్జీలను నియంత్రించాల్సిన రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న బహిరంగ



విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టీసిలోని సూపర్ లగ్జరీ బస్సుల్లో కర్నూలు నుంచి హైదరాబాద్‌కు రూ.350 ఉండగా అదే మార్గంలో ప్రయివేటులో నాన్ ఎసి సీటర్‌లో రూ.1500 వరకూ, ఎసి సీటర్‌లో రూ.1200 నుంచి రూ.2111, నాన్ ఎసి స్లీపర్‌లో అయితే రూ.900 నుంచి రూ.2వేల వరకూ, ఎసి స్లీపర్‌లో రూ.1749 నుంచి రూ.3399 వరకూ వసూలు చేస్తున్నారు. పండుగ రోజుల్లో హైదరాబాద్ నుంచి కర్నూలుకు వచ్చే వారి సంఖ్య ఎక్కువ ఉండటంతో ఆ రూట్‌లో ప్రయివేటు ట్రావెల్స్ అధిక మొత్తంలో దండుకుంటున్నాయి. హైదరాబాద్ నుంచి నంద్యాలకు ఎపిఎస్ఆర్‌టిసిలో రూ.490 ఉండగా అదే మార్గంలో ప్రయివేటులో నాన్ ఎసి సీటర్‌లో రూ.600 నుంచి రూ.1290 వరకూ, ఎసి సీటర్‌లో రూ.850 నుంచి రూ.2590, నాన్ ఎసి స్లీపర్‌లో అయితే రూ.1400 నుంచి రూ.3వేల వరకూ, ఎసి స్లీపర్‌లో రూ.1100 నుంచి రూ.2990 వరకూ వసూలు చేస్తున్నారు. కర్నూలు నుంచి విజయవాడకు ఆర్టీసి సూపర్ లగ్జరీలో రూ.512 ఛార్జీ ఉండగా ప్రయివేటులో సీటర్‌లో రూ.858 వరకూ వసూలు చేస్తున్నారు. అదే మార్గంలో ఆర్టీసి స్లీపర్‌లో రూ.870 ఉండగా ప్రయివేటులో రూ.990 నుంచి రూ.1130 వరకూ ఉంది. విజయవాడ నుంచి కర్నూలుకు స్లీపర్‌లో రూ.800 నుంచి రూ.1090 వరకూ వసూలు చేస్తున్నారు.

బ్లాక్‌లోనూ టికెట్లు

పండగ సీజన్‌లో ఊరికెళ్లేందుకు ప్రయాణికులు సీట్ల కోసం నానా తంటాలు పడాల్సి వస్తోంది. వారం రోజుల ముందు నుంచే ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలెట్టినా సీట్లు లభించడం లేదు. ఆయా ప్రయివేట్ ట్రావెల్స్ ఆపరేటర్లు ముందుగా టికెట్లను బుక్ చేసేసి ప్రయాణికుల నుంచి వచ్చే డిమాండును బట్టి బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించుకుంటున్నారన్న వార్తలూ వినిపిస్తున్నాయి.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం
- జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నా నిర్వించారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.నిర్మల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. ఐసిడిఎస్‌కు బడ్జెట్లో నిధులు పెంచి బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలన్నారు. ఆయిల్, కందిపప్పు, క్వాలిటీ ఇవ్వాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని, ప్రమోషన్‌లో రాజకీయ జోక్యం అరికట్టాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, జీవో నెంబర్ 1ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన వేతనం అందించాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి సమస్యలను సాధనకు మార్చిలో చలో విజయవాడకు, ఏప్రిల్ 5న చలో ఢిల్లీకి సిద్ధం కావాలని అన్నారు. అనంతరం డిప్యూటీ తాసిల్దార్ రామనాథరెడ్డికి సమస్యల వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటమ్మ, సునీత, నాగరాణి, సారమ్మ, ఎల్లమ్మ, మరియమ్మ, ఎలిజబెత్, **(మిగతా 6వ పేజీలో..)**

జిఓ నెంబర్ 1ని రద్దు చేయాలి

- నంద్యాల గాంధీ చౌక్ సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా, ఉద్యోగ, కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ వాటి గురించి మాట్లాడినా, ర్యాలీలు, సభలు నిర్వహించి ప్రశ్నిస్తే అరెస్టులు తప్పకుండా పోలీస్ రాజ్యాంగం చేయాలని చూస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డి నియంతృత్వ వైఖరిని నిరసిస్తూ, జీవో 1ను రద్దు చేయాలని మంగళవారం స్థానిక గాంధీచౌక్ సెంటర్లో సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి పట్టణ అధ్యక్షులు డి.లక్ష్మణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి పార్టీ ఈ మధ్య ఏర్పాటై అధికారంలోకి రావడం కోసం సంవత్సరం పాటు పాదయాత్రతో పాటు అనేక ర్యాలీలు, సభలు నిర్వహించి అధికారంలోకి వచ్చాక ర్యాలీ, సభలను నియంత్రిస్తూ జీవో నెంబర్1 విడుదల చేయడం ఆయన నియంతృత్వా నికి నిదర్శనమని అన్నారు. వైసిపి ప్రభుత్వం నవరత్న పథకాలు ప్రజలకు అందజేస్తున్నామని, అన్ని హామీలను అమలు చేశామంటూనే పెట్రోలు, డీజిల్ ధరలు రోజురోజుకు పెరుగుతుండడం వల్ల వాటి ద్వారా వస్తున్న (ట్యాక్స్) ఆదాయాన్ని ఏమాత్రం తగ్గించుకోకుండా ప్రజలపై భారం వేయడం అన్యాయమన్నారు. ఇవి చాలవన్నట్లు ఇంటి, చెత్త, నీటి పన్నులు, కరెంటు చార్జీల పెంపుతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులంతా ప్రతినెల 1నే జీతాలు వేయాలని, పిఆర్సి అమలు చేయాలని, ఓపిఎస్ అమలు చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని పోరాటం చేస్తున్నారని చెప్పారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీ కరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకపోతే తొలగించేం దుకు చర్యలు చేపట్టడం దారుణ మన్నారు. ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, ప్రజాతంత్ర వాదులు, లౌకిక శక్తులంతా ఏకమై వైసిపిని భూస్థాపితం చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కోశాధికారి వెంకటలింగం, నాయకులు జైలాన్, ఎల్లయ్య, నరసింహ, కిట్టయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆత్మకూర్** : జీవో నెంబర్ 1ని రద్దు చేయాలని పట్టణంలోని బస్టాండ్ ఎదుట జీవో కాపీలను దహనం చేశారు. సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రజాక్, రామ్ నాయక్ , నాయకులు చాంద్ బాషా, శివకుమార్, గణపతి, సద్దాం, రాముడు, ఘోర, రమణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు. **డోన్** : జీవో నెంబర్ 1ని ఉపసంహ రించుకోవాలని స్థానిక బేతంచెర్ల సర్కిల్ రోడ్డులో సిఐటియు మండల అధ్యక్షుడు పి.రామాంజ నేయులు అధ్యక్షతన రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.శ్రీకాంత్ ,శివరాం కోశాధికారి నాగమద్దయ్య, నాయకులు బి.లక్ష్మన్న, బి.నాగన్న, చిన్న రెహమాన్, విజయ్, కార్మికులు పాల్గొన్నారు.

జీవో 1ని రద్దు చేయాలని ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

ఆదివాసీల అభివృద్ధికి కృషి

- అన్ని సౌకర్యాలూ కల్పించాల్సిన బాధ్యత అధికారులదే
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ఆదివాసి చెంచు గిరిజనులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామాన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఓంకారం సమీపంలోని నాయుని చెరువు చెంచుగూడెంను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెంచులకు పక్కా గృహాలు, అంగన్వాడీ కేంద్రం, విద్యుత్ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ చెంచులతో మాట్లాడుతూ 'మీకు ఏమి సౌకర్యాలు కావాలి' అని అడిగారు. చెంచులు ' మాకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వ రుణాలు ఇవ్వాలి. తెలుగంగ మద్రాస్ కాలువ పక్కనే ఉండటం వల్ల చిన్న పిల్లలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. మేము అడవికి వెళ్లేందుకు పర్మిషన్ ఇప్పించాలి' అని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గతంలో అడవి ఉత్పత్తులపైన ఆదాయం పొంది జీవించే వారమని, ప్రస్తుతం అటవీ ఉత్పత్తుల సేకరణను అటవీ శాఖ నిషేధించింద చెంచులు వాపోయారు. తమకు వ్యవసాయానికి భూములను ప్రభుత్వం కేటాయించిందని, అయితే సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తమ భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. వెంటనే కలెక్టర్ స్పందిస్తూ గిరిజన సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ పరిధిలోని సేవలను గిరిజనులకు అందించాల్సిన బాధ్యత ఉందని సూచించారు. కార్యక్రమంలో ఈర్నపాడు సర్పంచి దొర్నిపాటి వెంకట లక్ష్మమ్మ, వైసిపి నాయకులు సుబ్బారెడ్డి, రమణయ్య, గోపాల్ రెడ్డి, తహశీల్దార్ ఉమారాణి, డిప్యూటీ తహశీల్దార్ హరిత, ఎంపీడీవో వాసుదేవగుప్త, వెలుగు ఏపిఎం రాజశేఖర్ రెడ్డి, పిఆర్‌డిఇ వెంకట్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

చెంచు గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్

వృద్ధురాలి సమస్యను వింటున్న జిల్లా కలెక్టర్

ప్రజల సందర్శన సమయపాలనలో మార్పు

- మధ్యాహ్నం 3 నుండి 5 వరకు అందుబాటులో కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజల సౌలభ్యం కోసం మున్సిపల్ కార్యాలయంలో సందర్శన సమయంలో పలుమార్పులు చేస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్ తెలిపారు. మంగళవారం మున్సిపల్ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 వరకు సందర్శకులకు కమిషనర్ అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు ఏవైనా గ్రీవెన్స్ ఉంటే ఆ సమయంలో నేరుగా కమిషనర్‌కి చెప్పుకోవచ్చన్నారు.

మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్

పోలీసు కుటుంబ సభ్యులకు ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాలలోని జిల్లా ఎస్పి క్యాంప్ కార్యాలయ ఆవరణలో పోలీస్ కుటుంబ సభ్యులకు సంక్రాంతిని పురస్కరించుకుని ముగ్గుల పోటీల కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కె.కళ్యాణి రఘువీర్ రెడ్డి పాల్గొన్నారు. ముఖ్య ఆహ్వానితులుగా డా.ప్రసన్న, జె.శిరీష చంద్రబాబు, దుర్గా సంకురయ్యలు విచ్చేసి ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కె.కళ్యాణి రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ సిబ్బంది కొద్దిగా పని ఒత్తిడి ఉన్నా మిగిలిన సమయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతి పండగను జరుపుకుని కుటుంబంలో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

ముగ్గులను పరిశీలిస్తున్న దృశ్యం

కమతం లక్ష్మీరెడ్డిని పరామర్శిస్తున్న భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

టిడిపి నాయకుడికి జగత్ విఖ్యాత్ రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - శిరివెళ్ల

రహదారి ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న మండలంలోని యర్రగుంట్ల గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నేత కమతం లక్ష్మిరెడ్డిని ఆళ్లగడ్డ యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ సైకిల్‌పై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెంట్, కార్‌లో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. టిడిపి నాయకులకు, కార్యకర్తలకు గత 50 ఏళ్ల రాజకీయ చరిత్రలో నిత్యం అందుబాటులో ఉంటూ అండదండగా నిలిచిన కుటుంబం ఏదైనా ఉందంటే అది ఒక భూమ నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డి ఫ్యామిలీ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు.

చేతుల పరిశుభ్రత తప్పనిసరి

ఉయ్యాలవాడ : చేతుల పరిశుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలని స్టార్ యూత్ అసోసియేషన్ ఐఇసి కో-ఆర్డినేటర్ చంద్రమౌళి తెలిపారు. మంగళవారం రూపనగుడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయిని విజయలక్ష్మి, సభ్యులు రుక్మిణి, హుసేని పాల్గొన్నారు.

గుండెపోటుతో సిపిఎం నాయకుడు మృతి

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం గాజులపల్లె గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు సి.బాలసుబ్బయ్య సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం ఆయన మృతదేహానికి సిపిఎం, వ్యకాసం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యకాసం మండల అధ్యక్షుడు కోటకొండ భాష మాట్లాడుతూ బాలసుబ్బయ్య మరణం పార్టీకి తీవ్ర లోటన్నారు. సిపిఎం నాయకులు, మద్దిలేటి, చిట్టెపు రమణ, చింతల నాగరాజు, బి .మద్దిలేటి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నివాళి అర్పిస్తున్న నాయకులు

13న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల

సంక్రాంతి పండగ సందర్భంగా నంద్యాల పట్టణంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 13న మండల స్థాయి (హోం టీం) కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం కబడ్డీ పోటీల వాల్ పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి శివ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్, పట్టణ నాయకులు కిరణ్‌లు మాట్లాడారు. యువకులను క్రీడలలో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 13న ఒక్కరోజు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.12 వేలు, రెండవ బహుమతిగా రూ.10 వేలు, మూడవ బహుమతి రూ.5 వేలు, నాలుగవ బహుమతి రూ.3 వేలు అందజేస్తామని, పోటీలో పాల్గొనదలచిన వారు జట్టుకు రూ.400 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

కబడ్డీ పోటీల పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ట్యాక్స్‌ల పేరుతో వ్యాపారులకు ఇబ్బందులు : టిడిపి

ప్రజాశక్తి - బనగానపల్లె

వైసిపి ప్రభుత్వం వ్యాపారులకు అనేక ట్యాక్స్‌లు విధిస్తూ తీవ్ర ఇబ్బందుల గురిచేస్తుందని టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య విమర్శించారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. సిఎం జగన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్రలో వ్యాపారస్తులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలు దాటినా ఏ ఒక్కటీ నెరవేర్చ లేదన్నారు. రకరకాల ట్యాక్స్‌లు విధిస్తూ వ్యాపారస్తులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. మద్యాన్ని విడతల వారీగా తగ్గిస్తానని చెప్పి ఇప్పుడు విడతలవారీగా మద్యం షాపులను, మద్యం రేట్లను పెంచడమే కాకుండా జే బ్రాండ్స్‌తో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నరని విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రజలు వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. చెత్తకు కూడా పన్ను వేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కిందని ఎద్దేవా చేశారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక జగన్ రెడ్డి చీకటి జీవోలను తీసుకువస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంటు వాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ పక్కిరరెడ్డి, యాగంటి దేవస్థానం మాజీ చైర్మన్ బత్తుల బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టంగుటూరి శీనయ్య

'బాల అకాడమీ'లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాలలోని బాల అకాడమీ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని కరెస్పాండెంట్ ఎం.జి.వి. రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత ప్రారంభించారు. సంక్రాంతి పండుగ ఉట్టిపడేలా రంగవల్లులు, పూరి గుడిసె, భోగిమంటలు పాఠశాల ఆవరణం కళకళలాడింది. సాంప్రదాయ వస్త్రధారణతో చిన్నారులు అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ మాట్లాడుతూ పెద్దలకు, పిల్లలకు నచ్చే నవ క్రాంతి సంక్రాంతి అని, మగువలు నచ్చే ముగ్గుల పండగ అని, బోసి నవ్వులతో ముద్దు ముద్దుగా మురిపించే ముద్దు పాపాయిలకు పోసే భోగిపల్ల పండుగని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో బోగి మంట వెలిగిస్తున్న ప్రిన్సిపల్

నంద్యాల ప్రజలకు రుణపడి ఉంటాం

- శిల్పా సహకార్ మహిళా బ్యాంక్ చైర్మన్ నాగిని రవి సింగారెడ్డి
- ఘనంగా మాజీ మంత్రి శిల్పా పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : శిల్పా కుటుంబం పట్ల ఇంతటి అభిమానాన్ని చూపుతున్న నంద్యాల పట్టణ, నియోజకవర్గ ప్రజలకు తమ కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుందని శిల్పా సహకార్ మహిళ బ్యాంకు చైర్మన్ నాగిని రవి సింగారెడ్డి అన్నారు. తన మామ, మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని మంగళవారం నంద్యాలలోని టెక్కె మార్కెట్ యార్డులో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నాగిని రవి సింగారెడ్డి పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో శిల్పా కుటుంబ అభిమానులు స్వచ్ఛందంగా వచ్చి రక్తం దానం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో శిల్పా సహకార మహిళా బ్యాంకు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

144 మంది మహిళలకు రూ.17 లక్షల రుణాలు పంపిణీ : శిల్పా మహిళా సహకార్ ఆధ్వర్యంలో పట్టణంలోని 144 మంది మహిళలకు దాదాపు 17 లక్షల రూపాయల రుణాలను నాగిని రవి సింగారెడ్డి పంపిణీ చేశారు. మహిళా బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరి లీల, సేవాసమితి మేనేజర్ లక్ష్మీనారాయణ, మహిళలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డికి గజమాలతో శుభాకాంక్షలు

పట్టణంలోని వైసిపి శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డికి గజమాల, కేకులతో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ మంత్రి శిల్పా మాట్లాడుతూ తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ, మా కుటుంబాన్ని ఇంతలా అభిమానించడం చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. నంద్యాల నియోజకవర్గ ప్రజలకు శిల్పా కుటుంబం ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు.

రక్తదానం చేస్తున్న నాగిని రవి సింగారెడ్డి తదితరులు

ముఖ్యమంత్రిని కలిసి నియోజకవర్గ సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సిఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో సిఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డిని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మంగళవారం కలిసి బనగానపల్లె నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరించారు. నియోజకవర్గంలో మైనింగ్, బనగానపల్లె పట్టణ ప్రజలకు ఇంటి స్థలాలతో పాటు పలు సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.22 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ఏరియా ఆసుపత్రి ప్రారంభోత్సవానికి సిఎంను ఆహ్వానించినట్లు తెలిపారు. అవుకు, బనగానపల్లె, కొలిమిగుండ్ల మండలాల్లో మైనింగ్ సమస్య, బనగానపల్లె పట్టణ ప్రజలకు ఉచిత ఇంటి స్థలాల సిఎంతో చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు చెప్పారు.

ఎస్.లింగందిన్నెలో అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని ఎస్ .లింగందిన్నె గ్రామంలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గత నెలలో ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి గ్రామంలో పర్యటించిన సందర్భంగా ప్రజల నుండి విజ్ఞప్తులు వచ్చాయి. ఈ నేపథ్యంలో వాటిని పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేశారు. స్థానిక సర్పంచ్ ఇరిగెల విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బిసి కాలనీ, ఓసి కాలనీ, ఎస్సీ కాలనీలలో మురికి కాలువలు, సిసి రోడ్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఎస్సీ కాలనీకి సంబంధించి స్మశాన వాటిక వరకు రహదారిని ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. సర్పంచి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు.

పనులను పరిశీలిస్తున్న సర్పంచి విశ్వనాథరెడ్డి

అనుమానాస్పద స్థితిలో వదిన, మరిది మృతి

ప్రజాశక్తి - బేతంచెర్ల

వదిన, మరిదిలు అనుమానస్పదంగా మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాల మేరకు ఆర్‌ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన కమ్మలపాటి మధుకు మహానంది మండలం బోయలకుంట్ల గ్రామానికి చెందిన సునీత (28)తో వివాహమైంది. బంధుత్వపరంగా తమ్ముడైన అశోక్ (25)కు సునీతతో గత కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉండటంతో బంధువులు ఇరువురిని పలుమార్లు మందలించినట్లు సమాచారం. ఈ నెల 9వ తేదీ కూడా సున్నిత తల్లిదండ్రుల వైపు నుండి ఇద్దరినీ మందలించి వెళ్లినట్లు సమాచారం. తెల్లవారేసరికి అశోక్ తన ఇంట్లో ఉరివేసుకుని, సునీత పురుగుల మందు తాగి మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న బేతంచెర్ల సీఐ ప్రీతం రెడ్డి సంఘటన స్థలాన్ని చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతి చెందిన అశోక్, సునీత

వికలాంగులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాములపాడు

మండల కేంద్రంలో భవిత సెంటర్లో వికలాంగుల విద్యార్థులకు ఫిజియోథెరపీ పరికరాల కోసం కొరకు గతంలో ఆత్మకూర్ బ్రేక్ ఇన్స్పెక్టర్ గా పని చేసిన పద్మభూషణ్ రెడ్డి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ పరికరాలను ఎంఈఓ బాలాజీ నాయక్, జడ్పీహెచ్ ప్రధానోపాధ్యాయురాలు వెంకటసుబ్బమ్మ మంగళవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఫిజియోథెరపీ పరికరాలకు ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు మల్లికార్జున నాయక్, నాయుడు, తదితరులు పాల్గొన్నారు .

వికలాగులకు పరికరాలను అందజేస్తున్న దృశ్యం

కొత్త నిబంధనలతో ఉపాధి కూలీలకు కష్టాలు..

గంటల తరబడి పనుల వద్ద నిరీక్షణ

ప్రజాశక్తి - కొత్తపల్లి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలు కూలీలకు కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా గంటల తరబడి పనుల వద్ద నిరీక్షిస్తున్న వైనం నెలకొంది. కొత్తపల్లి మండలంలో 12 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇప్పటికే ఈ మండలం నుంచి ఇతర ప్రాంతాలకు పిల్లల నుంచి వృద్ధుల వరకు గ్రామాలను విడిచి వలసలు వెళ్లారు. వలసలు వెళ్తున్న సంఘటనలు చూసి అధికారులు కొత్తపల్లి మండలంలో సోమవారం నుంచి ఉపాధి పనులు ప్రారంభించారు. గ్రామాల్లో కూలీలు ఉదయం 8:30 గంటలకు మొదలుకొని 9:30 గంటలలోపు పనులు చేస్తున్నారు. అప్పటికి ఉపాధి సిబ్బంది ఒక ఫొటో తీసుకుంటున్నారు. మరొక ఫొటో కోసం మధ్యాహ్నం 1:30 వరకు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. గంటల తరబడి నిరీక్షించినా రెండవ ఫొటో సెల్ ఫోన్‌లో తీసుకోకపోవడంతో ఉపాధి సిబ్బంది, కూలీలు నిరుత్సాహంతో వెను దిరగాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి వలసలు నివారిస్తామని చెబుతున్న అధికారులు మారుతున్న నిబంధనలకు వలసలు మరింత పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఉపాధి కూలీలు పని ప్రదేశంలో 7 గంటలు పని చేసి 1 గంట విశ్రాంతి తీసుకుని 8 గంటల వరకు పని ప్రదేశంలో ఉండాలి. ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా పని ప్రదేశంలోనే కూలీలు ఉన్నప్పటికీ వేతనం ఎంత మేర వస్తాయని చర్చించుకుంటున్నారు. మరి కొన్ని గ్రామాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుత నిబంధనలు కూలీల పట్ల శాపంగా మారాయి. పని ప్రదేశంలో ఉండాల్సిన నీడ లేక సమీపంలో ఉన్న చెట్లను ఆశ్రయించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఉపాధి కూలీలు వాపోతున్నారు.

గంటల తరబడి పని ప్రదేశంలో ఉండాలి

- జయన్న ఉపాధి కూలీ, సింగరాజు పల్లి

పని ప్రదేశంలో గంటల తరబడి ఉండాలి. గతంలో అలా లేదు. నిబంధనలు కూలీలకు ఇబ్బందికరంగా మారాయి. గంటల తరబడి ఫొటో కోసం నిరీక్షణ పరిస్థితి నెలకొంది. కూలీలు ఎంత వస్తాయో అర్థం కావడం లేదు. అధికారుల స్పందించి నిబంధనలు మార్చాలి.

సమస్యలు ఉన్నతాధికారులకు తెలియజేస్తాం

- ఎపిఒ శ్రీనివాసులు

గ్రామాల్లో ఉపాధి కూలీల నుంచి వస్తున్న సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. ప్రస్తుతం నిబంధనలు మారడం వల్ల కూలీలకు కొంతమేర ఇబ్బందులు కలుగుతున్నాయి. కొత్తపల్లి మండలంలో కూలీల సమస్యను ఇప్పటికే అధికారులకు తెలియజేశాం.

వలసలు మరింత పెరిగే అవకాశం ఉంది

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సాములు

కొత్త నిబంధనలతో గ్రామాల్లో వలసలు మరింత పెరిగే అవకాశం ఉంది. పని ప్రదేశంలో ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా పడిగాపులు కాస్తున్నారు. ప్రతి కూలికి 600 రూపాయల వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. పని ప్రదేశంలో కూలీలకు కనీస సౌకర్యాలు లేవు. అధికారులు స్పందించి నిబంధనలు

ప్రజలకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్న డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి

వైసిపి ప్రభుత్వంలో ఆకాశాన్నంటిన నిత్యవసరాలు

- డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - డోన్

వైసిపి ప్రభుత్వంలో ఇసుక ధరలతో పాటు నిత్యవసరాల ధరలు ఆకాశానంటుతున్నాయని డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి విమర్శించారు. మంగళవారం డోన్ పట్టణంలోని ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు అధ్యక్షతన నందమూరి తారక రామారావు విగ్రహం దగ్గర నుండి పాతబస్టాండు వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి హాజరయ్యారు. జగన్ రెడ్డి మోసాలను, దుర్మార్గ పాలనను కప్పిపుచ్చుకోవడానికి తెచ్చిన జీవో01ని రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రజలు, వ్యాపారస్తులు వారి సమస్యలు తెలియజేస్తూ ఎన్నడూ లేనంత విపరీతమైన కరెంటు చార్జీలతో, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో బతకడం కష్టమయిందని వాపోయారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి వలసల రామకృష్ణ, రాష్ట్ర టిడిపి ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, నంద్యాల జిల్లా టిడిపి అధికార ప్రతినిధి విజయ్ భట్, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - చాగలమర్రి

గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేందుకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు పంపిణీ చేశారు. మండల యూటీఎఫ్ 'అధ్యక్షులు డెన్నీ జాన్సన్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండలంలోని అన్ని పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మెటీరియల్స్‌ను తయారు చేయించారు. వాటిని ఎంపీపీ చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి యుటిఎఫ్ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ఆర్థిక కార్యదర్శి బెన్నయ్య, కార్యదర్శులు శంకర్, హేమాద్రి, విజయరాజు, గౌస్‌అహ్మద్, మదన్ గోపాల్ పాల్గొన్నారు.

టెన్త్ మెటీరియల్స్‌ను అందజేస్తున్న ఎంపీపీ, యుటిఎఫ్ నేతలు, తదితరులు

ప్రశాంతంగా జీవనం సాగించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - చాగలమర్రి

గ్రామాల్లో ప్రజలు కక్ష్యలు, కార్పణ్యాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్ రెడ్డి తెలియజేశారు. చాగలమర్రి పట్టణం లోని పోలీసు స్టేషన్లో మండలంలోని ఆయా గ్రామాల పెద్దలతో మంగళవారం రాత్రి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అల్లర్లకు తావులేకుండా ప్రజలంతా ప్రశాంతంగా జీవనం సాగించాలన్నారు. చట్ట, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.కార్యక్రమంలో ఎస్సై సత్యనారాయణ, ఏఎస్సై మేరీ జయంతి, ఎంపీపీ రామిశెట్టి వీరభద్రుడు, మండల ఉపాధ్యక్షులు ముల్లారపి, ప్రభుత్వ ఖాజీ యూనస్, వైకాపా మండల కన్వీనర్ కుమార్రెడ్డి, తెదేపా నంద్యాల బీసీసెల్ స్పోక్ పర్సన్ సల్లానాగరాజు, టీఎన్ టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తినరసింహులు, ఎంపీటీసీ సభ్యుడు పత్తినారాయణ, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి హనీఫ్, గ్రామ పెద్దలు తొమ్మండ్రు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్రెడ్డి

పార్టీలకతీతంగా పథకాలు : వైసిపి

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్రంలో రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వం ప్రజలకు పథకాలను అందిస్తోందని ఎంపీపీ బుగ్గన నాగభూషణ్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం కొలుముల పల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గ్రామ సర్పంచ్ చిన్నమద్దమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బేతం చెర్ల మండలంలోని గ్రామాలకు తాగునీటి సౌకర్యం, సిసి రోడ్లు, విద్యుత్తు వంటి సౌకర్యాలను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అభివృద్ధి చేయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ రంగస్వామి, గోరుమాలకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు, శేఖర్, రామానాయుడు, కృష్ణుడు, ఖాజా, హుస్సేన్, ఎద్దులన్న, మద్దమ్మ, ఖాదర్ బాషా, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను వివరిస్తున్న వైసిపి నాయకలు

ఐసిడిఎస్ కార్యాలయన్ని ఆర్జెడి ఆకస్మిత తనిఖీ

ప్రజాశక్తి - ఆత్మకూరు

పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయాన్ని ర్జెడి పద్మజ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను ఆమె పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలు సక్రమంగా నడిచే విధంగా సూపర్వైజర్లు పర్యవేక్షించాలని ఆమె సూపర్వైజర్లకు సూచించారు.

సమస్యలను తెలుసుకుంటున్న ఆర్జెడి పద్మజ

IN THE COURT OF PRINCIPAL
JUNIOR CIVIL JUDGE : DHONE
O.S.No.274/2022

Ediga Lakshmidevi. ...Plaintiff

Vs

షేక్ షేక్షావలి
తండ్రి మహమ్మద్ కాశీం,
యు.కొత్తపల్లి గ్రామము,
డోన్ మండలం, నంద్యాల జిల్లా. ..Defendant

ప్రతివాదిసమన్స్

పై దావాను ప్రాంసరి నోటు బాపతు దాఖలు చేయడం జరిగినది. నీవు సమన్స్ తీసుకోనందున పై కోర్టు నందు 30-01-2023వ తేదిన ఉదయం 10.30 గంటలకు, నీవు కాని, నీతరపు వకీలు ద్వారా కాని హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనేది. లేనంత నీ పరోక్ష మందు తీర్మాణించబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా తేది : 30-01-2023

M.Gopal Reddy,
Advocate,
డోన్, నంద్యాల జిల్లా.
Cell : 9440557898

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - నందికొట్కూరు

ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లకు మాండ్ర అనంతరెడ్డి చేతుల మీదుగా బహుమతుల ప్రధానం చేశారు. విజేతగా నందికొట్కూరు టీం, రన్నర్స్ పగిడ్యాల టీం, థర్డ్ ప్లేస్ నందికొట్కూర్ టీం-2లు నిలిచాయి. నందికొట్కూరు నియోజకవర్గం అధికార ప్రతినిధి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, మాజీ మండల అధ్యక్షులు వీరం ప్రసాద్ రెడ్డి, పార్లమెంట్ అధికార ప్రతినిధి గిరీశ్వర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మిడుతూరు మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి పాములపాడు మండల కన్వీనర్ హరినాథ్ రెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, పగిడ్యాల మండల కన్వీనర్ మహేష్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ఐటీడీపీ అధ్యక్షులు ముర్తుజావలి, మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షకీల అహ్మద్, లీగల్సెల్ నాయకులు జాకీర్ హుస్సేన్, ఎస్సీ సెల్ నాయకులు జయసూర్య నిమ్మకాయల రాజు, నిమ్మకాయల మోహన్,రాజన్న, బీసీ సెల్ అధ్యక్షులు వేణుగోపాల్ వార్డు వార్డు ఇన్చార్జిలు మసాలా కాజా, కళాకార్, వంశీ, శ్రీనివాసులు తెలుగు యువత పట్టణ అధ్యక్షులు కుమార్ బ్రహ్మ హుస్సేన్ సతీష్,ముత్తు, మట్ట చాంద్, సోమశేఖర తదితర నాయకులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - పాములపాడు

స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని ఎంపిడిఎ సుమిత్రమ్మ అన్నారు. మంగళశారం నాడు మండల కేంద్రంలో నెహ్రూ యువ కేంద్రం కర్నూల్ వారి సహకారంతో మహిళలకు ఉచిత వైరు బుట్టల అల్లకం శిక్షణ కేంద్రాన్ని ఎంపిడిఒ పరిశీలించారు. ఆమె శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. శిక్షణ ఇస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కేంద్రాన్ని నిర్వహిస్తున్న వైఆర్‌డిఎస్ అధ్యక్షుడు షర్ఫుద్దీన్ అలీని ఆమె అభినందించారు. ఈ ప్రాంతంలో కొన్ని సంవత్సరాలుగా షర్ఫుద్దీన్ అలీ మహిళలకు శిక్షణ కార్యక్రమంతో పాటు పల్స్ పోలియో, ప్రభుత్వ కార్యక్రమాల్లో వాలంటరీగా సోషల్ సర్వీస్ చేయడం పట్ల షర్ఫుద్దీన్ అలిని ఆమె అభినందించారు. మహిళలు ఇలాంటి అవకాశాలు వినియోగించుకొని కుటుంబాల ఆర్థిక అభివృద్ధిని పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. కొట్టు సెంటర్‌పై ఆమె సంతోషం వ్యక్తపరిచారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - బేతంచర్ల

మండల పరిధిలోని ఎంబాయి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉన్నత పాఠశాలలో చదువుతూ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి ప్రకాష్ రావు మంగళవారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి ప్రకాష్ మాట్లాడారు. జాతీయస్థాయిలో పేరును నిలబెట్టాలని అన్నారు. విద్యార్థులకు క్రీడా దుస్తులు అందించడం వల్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం, పిఈటి ఉపాధ్యాయులు శ్రీనివాసులు వెంకటేశ్వర్లు డేవిడ్ హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధి పనులను ఎపిడి పరిశీలన

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలో తుమ్మలూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీడి అన్వర్ బేగం మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కోరిన ప్రతి ఒక్కరికి పని చూపించడం జరుగుతుందని, ఎవ్వరు వలసలు పోవాల్సిన అవసరం లేదన్నారు. ఇచ్చిన కొలతల ప్రకారం పని చేసుకున్నట్లయితే రూ.275లు వేతనం పడుతుందని ఆమె కూలీలకు తెలిపారు. ఈమె వెంట ఏపీవో విమలమ్మ, సిటిప స్వాములు, జేఈ రమేష్ నాయుడు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కొనసాగించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - జూపాడు బంగ్లా

ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించకుండా ఎస్సీ ఎస్టీలకే ఖర్చు పెట్టాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షురాలు కే రంగమ్మ, డిమాండ్ చేశారు. స్థానిక బన్నూరు సచివాలయంలో పంచాయతీ సెక్రెటరీ రామకృష్ణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ నెల 23వ తేది జిల్లా అంతటా అన్నీ మండలాలో ప్రభుత్వఅధికారులు కు, స్థానిక ప్రజాప్రతినిధులు కు వినతిపత్రం ఇచ్చి ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం కొనసాగాలని పేర్కొన్నారు. చర్మకారులు,డప్పు కళాకారులు, ఊసన్న, ప్రకాశం, వెంకటేశ్వర్లు, రాజు,దేవదానం, పాల్గొన్నారు.

వివినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఇన్నర్ వీల్ డే సందర్భంగా పార్కులో బెంచీలను ఏర్పాటు చేసిన ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు

ఘనంగా ఇన్నర్ వీల్ క్లబ్ డే వేడుకలు

ప్రజాశక్తి-డోన్

పట్టణంలోని తారక రామనగర్‌లోని ఇన్నర్ వీల్ క్లబ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఇన్నర్ వీల్ క్లబ్ డే సందర్భంగా స్థానిక పార్కులో కూర్చోవడానికి దాతలు ఆర్టీసీ ఎస్టీఐ జె.ఫక్కిరా,ఎఎం ఎఫ్ పుల్లయ్య, రిటైర్డ్ హెచ్‌ఎం జే. రామదాసు, ఇద్దరు కండక్టర్లు,ఇన్నర్ విల్ క్లబ్ సభ్యులు సహకారంతో నాలుగు సిమెంట్ బెంచీలను అందజేశారు. ఇన్నర్ వీల్ సభ్యులకు పార్కు కు సంబంధించి పూర్తి బాధ్యతలు అప్పగించినందుకు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేస్తూ ఉంటామని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్టీసీ ఆర్ఎ శాంతి అన్నారు. ఇన్నర్ విల్ క్లబ్ సభ్యులు సుమిత్ర, రాజాసుజాత, అనురాధ,పద్మ, మంజు ల,మర్రి సరళదేవి, రాధారెడ్డి, షాలిని, విజయ లక్ష్మి, శారద,సూర్య కుమారి,మద్దమ్మ పాల్గొన్నారు.

మహారాజ శ్రీ డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
O.S.No.318/2021

B.NARASAIAH. ...వాది

-Vs-

S.K.KARIMULLA. ...ప్రతివాది
Aged - 40 Years,
S/o S.K.Madar Saheb,
Muslim, Railway Employe,
R/o Dhone (T), (M), Nandyal (Dist)
Now Working at FLHLPR. Diesel Shed,
Guntakal, R.S, SF. Railways,
Guntakal (Divison).

ప్రతివాదికి సమను

వాది అనేవారు అప్పుపై డిక్రి కొరె నిమిత్తము నీ మీద దాఖలు చేసినందున సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పుటకు 18/01/2023 తారీఖున పగలు 10-30 గంటలకు మీరు స్వతహగా గానీ, వకీలు ద్వారా గాన ఈ కోర్టులో హాజరు అయి మీ ప్రతివాదనకు ఆధారంగా మీరు మీ దస్తావేజులను ఈ దావాకు సంబంధించి ఆ రోజున హాజరుపరుచుటకు మీకు ఉత్తర్వు చేయడమైనది పైన చెప్పబడిన దినమందు మీరు హాజరుకాకుండా తప్పిన యెడల మీ పరోక్షమందు ఆ దావాను విమర్శచేసి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

(By Order Of The Court)

వాయిదా తేది : 18-01-2023

K.Yoganandha Reddy,
K.Satyanarayana Reddy,
E.Madhu Sudhan Reddy,
వాదిపరం న్యాయవాదులు,
డోన్, నంద్యాల జిల్లా.
సెల్ : 9440588845

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

(5వ పేజీ తరువాయి..) పట్టణ, మండలం అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు. **బనగానపల్లె రూరల్ :** వైయస్సార్ సంపూర్ణ పోషణ మెను చార్జీలను పెంచాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు షేభా డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు డివిజన్ అధ్యక్షులు జివి సుబ్బయ్య ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరసన తెలియజేశారు. తహశీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు రోజా రమణి, అంగన్‌వాడీలు శశికళ, హేమలత, పర్వీన్, రాజేశ్వరి, వెంకటలక్ష్మి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సిఐటియు నాయకులు దావీదు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు పద్మావతి, శ్రీదేవి, త్రివేణి, రేణుక, భాగ్యలక్ష్మి, వసుంధర, వివిధ గ్రామాల అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. **ఉయ్యాలవాడ :** ఉయ్యాలవాడ మండలానికి చెందిన అంగన్వాడీ కార్యకర్తలు తహశల్దార్ కార్యాలయంలో ఆర్ఐ సత్తార్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. **సంజామల :** అంగన్వాడీ వర్కర్ల మండల అధ్యక్షురాలు సుజాత ఆధ్వర్యంలో కార్యకర్తలు వినతి పత్రం తహశీల్దార్ మల్లికార్జునరావుకు అందజేశారు. అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు. **పాణ్యం :** తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. వినతి పత్రాన్ని తహశీల్దార్‌కి అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి కె భాస్కర్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటమ్మ, మరియమ్మ, మాబున్నిసా, వెంకటమ్మ, శ్యామల, లక్ష్మీదేవి పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ:** అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు వెంకటయ్య, రమేష్ బాబు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దార్ హరినాథ్ రావుకు వినతిపత్రం సమర్పించారు. అంగన్వాడీ యూనియన్ నాయకురాల్లు రాజ్యలక్ష్మి,పెద్దక్క, శైలజ, బాల తిమ్మమ్మ, తిరుపతమ్మ, సుజాత, గౌసియా, బద్రుణ్,వేణమ్మ, శాంతమ్మ, నాగేంద్రమ్మ పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు మంజుల, విజయలక్ష్మి, సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రజాక్, రామ్ నాయక్‌లు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేసి తహసిల్దార్ ప్రకాష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. గ్రాట్యూటీ అమలు చేసి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. సూపర్వైజర్ పోస్టులలో వయోపరిమితి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు లక్ష్మీదేవి, ప్రియాంక, రమణమ్మ, వాణి, శ్రీదేవి, అనసూయ, రమణమ్మ, చెన్నమ్మ, శాంతి, సిఐటియు నాయకులు సద్దాం, గణపతి, తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని, అంగన్వాడి వర్కర్లకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో పాములపాడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహశీల్దార్ రత్న రాధికకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు శివలక్ష్మి, రవణమ్మ బాయిలు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సామన్న, అంగన్వాడి వర్కర్స్ నాగమద్దమ్మ, నాగమణి, స్వాతి, శ్రీలత, మునెమ్మ పాల్గొ న్నారు. **గడివేముల :** సమస్యలు పరిష్కరించాలని గడివేముల తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్లు ధర్నా చేశారు. అనంతరం వినతి పత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నాగమణి అధ్యక్షతన సిఐటియు మండల కార్యదర్శి రామ్ మద్దిలేటి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్, హ్యాండ్ హెల్పర్స్ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు వసంత లక్ష్మి, రామ చిన్నమ్మ, రాములమ్మ, జయలక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు. **వెలుగోడు :** సిఐటియు మండల అధ్యక్షులు వాదం నాగ మోహన్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్న నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి తాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, అంగన్వాడీల ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకురాలు ఏ ఆర్ తులసమ్మ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామదాసు, నాయకులు డిప్యూటీ తహసిల్దార్ సత్య శ్రీనివాసులుకు వినతి పత్రాన్ని అందజేశారు. అంగన్వాడీ వర్కర్లు ఎం విజయమ్మ, పి అనిత బాయి, కె.వి.రమణమ్మ, పద్మాబాయి, గౌరీ, కుమారి, లక్ష్మీనరసమ్మ, తదితరులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** సిఐటియు జిల్లా నాయకులు వైబి వెంకటేశ్వర్లు, డి సంజీవ నాయుడు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలపారు. అనంతరం అంగన్వాడి వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎన్కే నాగలక్ష్మి, ఎస్ గుల్జార్బిలతో కలిసి వినతిపత్రాన్ని తహశీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు రమాదేవి, వరలక్ష్మి, సరస్వతి, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి :** స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేసి, తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు హరిత, తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్ : వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్

మిడుతూరు : సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపి, అంగన్వాడి వర్కర్స్ సమస్యలతో కూడిన వినతి పత్రం డిప్యూటీ తహల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల సహాయ కార్యదర్శి బి వెంకట శివుడు, మండల అధ్యక్షులు జి లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** పట్టణంలోని సిఐటియు కార్యాలయం నుండి అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి, స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ పద్మావతికి ఇచ్చారు. అనంతరం అనంతరం సిఐటియు అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కే భాస్కర్ రెడ్డి మాట్లాడారు. సిఐటియు టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు టి గోపాలకృష్ణ, ఆర్ జయ, ప్రాజెక్టు అధ్యక్షురాలు మదర్, బి శైలజ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అంగన్వాడీ కార్యకర్తలు వినతి

బండి ఆత్మకూర్ : అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మునజీర్ జిల్లాని సామాన్‌కు అంగన్‌వాడీ వర్కర్స్ వినతి పత్రం అందజేశారు. మంగళవారం మండలంలోని నాయుని చెరువు చెంచు గూడెంకు వచ్చిన కలెక్టర్‌ను అంగన్‌వాడీ వర్కర్స్ కలిశారు. యూనియన్ సభ్యులు వెంకటరమణ, రాజమ్మ, శ్యామల మాట్లాడుతూ తాము తక్కువ జీతంతో నిరంతరం ప్రభుత్వ సేవలో అంగన్వాడీ కార్యకర్తల్లో పనిచేస్తున్నామని తమకు రావలసిన కూరగాయల బిల్లులు, విద్యుత్ చార్జీలు, గ్యాస్ తమకు అందడం లేదని అన్నారు. బిల్లులు సరిగా రాకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాలసీల ప్రకారం విధివిధానాలను పాటించా లన్నారు. ఫేస్‌యాప్ విధానం ప్రభుత్వం పాలసీ అని, తమ పరిధిలో లేదని కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సిఐటియు నాయకులు రత్నమయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మహారాజా శ్రీ గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి దొరవారి కోర్టు నందికొట్కూరు.
ఓ.యస్.నెం.92/2018

వడ్డే గోవింద్. ...వాది

ఎదిరి

షేక్ కలాం బాషా.
...ప్రతివాది

SUMMONS TO THE DEFENDANT

షేక్ కలాం బాషా.
తండ్రి: షేక్ గఫార్ మియ్య
C/o. అజ్మతుల్లా ట్రేడర్స్,
షాపు నెం 8-870, పగిడ్యాల రోడ్డు,
నందికొట్కూరు పట్టణం మరియు మండలం
నంద్యాల జిల్లా.

పై వాది పై కోర్టు నందు ప్రతివాది అయిన మీపై తనకు రావలసిన ప్రామిసరి నోటు బాకీని రాబట్టుకొనుటకు పై కోర్టులో దావాను దాఖలు చేసివున్నాడు. పైన కనబరచిన కేసులో ప్రతివాది అయిన నీకు ఎన్నిసార్లు సమన్లు పంపిన తీసుకోనందువల్ల కోర్టువారు పై కేసును తేది 18-01-2023న నీ హాజరు నిమిత్తం వాయిదా వేసివున్నారు. కావున నీవు తేది 18-01-2023 నాడు ఉదయం గం.10-30 నిIIలకు పై తెలిపిన గౌరవ న్యాయస్థానము వారి ఎదుట ఖుద్దుగా గాని లేదా నీ తరపు న్యాయవాదుల ద్వారా కాని హాజరై ఏదైనా అభ్యంతరములు వున్న యెడల గౌరవ కోర్టువారికి తెలియజేసుకొనగలరు. లేని యెడల నీ పరోక్షమున కేసు తీర్మానించబడును

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

నందికొట్కూరు
వాయిదా తేది 18-01-2023

(సి.సి.వి. రంగారెడ్డి),
(చెరుకు వెంకటేశ్వర్లు),
న్యాయవాదులు,
డోర్ నెం.11-519-1 ,
సుబ్బారావు పేట,
నందికొట్కూరు.